శ్రీ రామకృష్ణ ప్రభ

49

౧౯౫౧, నవంబరు—ఖర, కార్తీకము

సంపుటము ౮ సంచిక ౫

C.P. BROWN MEMORIAL LIBRARY
Acc. No. 880
Date
CUDDAPAH.

శ్రీ రామకృష్ణమఠము, మైలాపూరు
చెన్నపురి

విషయసూచిక

ప్రార్థన ౧౧౩
శ్రీరామకృష్ణ వచనామృతము—'సు.' ౧౧౪
శ్రీ తురీయానంద లేఖావళి ౧౧౭
శ్రీ బ్రహ్మానందస్వామి పారమార్థిక ప్రతిభాతిశయము ... ౧౧౮
గోపాల్ మా—శ్రీ దువ్వూరి రామకృష్ణారావు, బి. ఏ. ... ౧౨౧
శ్రీ వాసుదేవ మననము—శ్రీ మాచిరాజు శ్రీరామకృష్ణ ... ౧౨౭
ప్రశ్నోత్తరి—శ్రీ గుమ్మలూరి లక్ష్మీనృసింహశర్మ ౧౩౨
శ్రీ వివేకానంద సంభాషణలు—అనువాదకుఁడు శ్రీ చిన్నింటి సుబ్బారావు ౧౩౫
గ్రంథ సమీక్ష ౧౪౦

శ్రీ రామకృష్ణ ప్రభ

చందాదారులకు

౧. పత్రిక ప్రతిమాసము 20-వ తేదీన వెలువరింపఁబడును. ఒక వారము, పదిరోజులు దాఁటి ప్రతి మీకు అందకపోయినయెడల ఉత్తరము వ్రాయుఁడు.

౨. సంవత్సర చందా రు. 3 లు మాత్రమే. జనవరి నెల నుండిగాని జూలై నెల నుండిగాని చందాదారులుగఁ జేరవచ్చును. ఇతర మాసములలోఁ జేరదలచు వారికి జనవరి నెల నుండిగాని జూలై నెల నుండిగాని సంచికలు చేర్చిపంపఁబడును. విడిప్రతి రూ. ౦—౬—౦ లు. హిగిన్‌బాదంస్ వారి స్టాలులోఁ గాని, మా పత్రికా ఏజెంటును గాని అడుగుఁడు.

3. ఉత్తర ప్రత్యుత్తరములు వీలైనంతవఱకు ఇంగ్లీషున వ్రాయుచు మీ చందాదారు సంఖ్యను ఉదాహరింపుఁడు. ఉత్తరములను "మేనేజరు, శ్రీరామకృష్ణప్రభ" అను చిరునామాకు వ్రాయుఁడు.

౪. చిరునామాయందు ఏట్టిమార్పు గలిగినను 10-వ తారీఖునకు ముందుగా మా కార్యాలయమునకుఁ దెలుపవలయును. లేనిచో, పత్రిక పూర్వపు చిరునామాకే పంపఁబడును.

వ్యాసకర్తలకు

౧ కేవలము నైతిక ధార్మిక వైజ్ఞానిక విషయకములైన వ్యాసములేకాక, సాహిత్యమునకును కవిత్వమునకును సంబంధించిన ఏ వ్యాసములైనను పంపవచ్చును. సులభ సుందరమగు గ్రాంథిక భాషలో వ్రాయవలయును.

౨. వ్యాసములు అచ్చులో మూఁడు పుటలకు మించరాదు. ప్రతి నెల ఒకటవ తేదీకి వ్యాసములు మాకు అందవలెను.

3. వ్యాసములను, విమర్శకుఁ బంపు గ్రంథములను, వినిమయముగఁ బంపెడి పత్రికలను "సంపాదకుఁడు, శ్రీరామకృష్ణ ప్రభ శ్రీరామకృష్ణ మిషన్ స్టూడెంట్స్ హోమ్, మైలాపూరు, చెన్నపురి" అను చిరునామాకు వ్రా పంపవలెను.

౪. వ్యాసము తిరుగఁ బంపఁబడవలయుననుచో తగు పోస్టేజి చేర్చి పంపవలెను

శ్రీరామకృష్ణ ప్రభ

సంపుటము ౮ } ౧౯౫౧ – నవంబరు : : ఖర – కార్తీకము } సంచిక ౩

ప్రార్థన

ఓం

శ్లో. శాంతాకారం సమాధౌ స్థిత మతులతను
జ్యోతిషా వ్యాప్త దేశం
సిద్ధే పీఠే నిషణ్ణం స్మిత లసిత ముఖం
హర్ష బాష్పాప్లు తాక్షమ్।
చార్వజ్గం స్వర్ణవర్ణం వరద మభయదం
జీవనం సజ్జనానాం
దేవాధీశం భజేఽహం హ్యగణిత గుణినం
భక్తితో రామకృష్ణం ॥

ఓం నమో భగవతే శ్రీరామకృష్ణాయ !

శ్రీ రామకృష్ణ వచనామృతము—'మ.'

దక్షిణేశ్వర దేవాలయము

మంగళవారము,
16 అక్టోబరు, 1882.

బలరామ్‌బోసు జనకుడు, రాఖాల్, వేణీపాల్, 'మ.', మణిమల్లికు, ఈశానుడు, కిశోరుడు మున్నగువారు వచ్చియుండిరి.

శ్రీరామ:—ఉదారభావము గలవారు సకల దేవతలను నమ్ముదురు. కృష్ణుడు, కాళి, శివుడు, రాముడు! మున్నగువారినెల్ల—.

బలరాముని తండ్రి:—ఔను, ఒకే భర్త వేరువేరు దుస్తులను ధరించియున్నను భార్య తన భర్తను గురుతుపట్టునట్లు.

శ్రీరామ:—కాని నిష్ఠభక్తి యొకటి గలదు. గోపికలు మధురానగరమును జేరి రాజవేషధారి యయిన శ్రీకృష్ణుని జూచి తలవంచుకొని, 'ఇతడెవరు? పీతాంబరధారి, మయూరఫించ భూషితుడు నగు మా శ్రీకృష్ణుడేడి?' యనిరట. హనుమంతునకుగూడ నిష్ఠభక్తి యుండెను. ద్వాపరయుగమున ద్వారకానగరమునకు ఆయన విజయముచేసినపుడు శ్రీకృష్ణుడు రుక్మిణితో, 'హనుమంతుడు రామరూపమును జూడనిచో సంతృప్తి నందజాలడు' అని పలికి శ్రీరామరూపమును ధరించెనట.

నాకిట్టి దశ కలుగునని ఎవరెఱుగుదురు నాయనా? నేను ఆ శుద్ధబ్రహ్మమునుండి ఆయన లీలాస్థితికి వత్తును. మరల ఆ లీలారంగము నుండి నిత్యవస్తువునే చేరుదును. నిత్యవస్తువును జేరుటయే బ్రహ్మజ్ఞానము. అది యెంతయు దుర్లభము. సంపూర్ణముగ విషయాసక్తి తొలంగకపోయినచో ఆ వస్తువును చేరజాలము. హిమవంతునియింట భగవతి జనించినపుడు తన తండ్రికి వివిధ దర్శనముల ననుగ్రహించెను. అంతట హిమవంతుడు, 'అమ్మా! నేను బ్రహ్మదర్శనము బడయవలయునని వాంఛించుచున్నా'నని కోరెను. అందులకు భగవతి, 'మీ కట్టి కోరికయే యున్నచో సాధుసంగమము నొనర్పవలయును. సంసారమును త్యజించి ఏకాంతముగ నిర్జనస్థలములయందు సాధుసంగమము నొనరింపవలయు'నని పలికెను. *

ఆ ఏకవస్తువునుండియే వివిధములు కలుగుచున్నవి. అనిత్యవస్తువు లీలయే యిది. ఆ ఒక్కవస్తువు స్థితిని బడసినపుడీ 'యనేకము'

* దేవీభాగవతము సప్తమస్కంధమునందలి 31, 35, 36-వ అధ్యాయములు.

లదృశ్యములగును. పిదప ఆ యొక్కటియు గూడ మాయమగును. ఏలయన ఒకటి యున్నప్పుడే రెండవదియును కలుగ నోపును. ఆ పరబ్రహ్మము ఉపమానరహితమైనది. ఎవరును ఉపమానములచేత బ్రహ్మమును దెలుపజాలరు. అది చీకటికి వెలుతురునకు మధ్య నున్నది. కాని ఆ వెలుతురు మనము జూచుచున్న జడాత్మకమగు వెలుతురు గాదు.† మఱియు ఎపుడు ఆ పరబ్రహ్మము మన అవస్థను మార్చునో అపుడు మన మాయన లీలారంగమునకు దిగి వత్తుము. అంతట అదియే (ఆ పరబ్రహ్మమే) భగవానుడు, మాయ, జీవజగత్తులుగ పరిణమించినట్లు గోచరించును. మఱియు ఆ బ్రహ్మమే ఈ సమస్త జీవజగత్తును సృష్టించినట్లు—యజమానుడును వాని తోటవలె—కనుపించును. ఆతడే కర్త. ఈ జీవజగత్తంతయు ఆయనదే యని తెలిసికొనుటయే జ్ఞానము. నేను కర్తను, తండ్రిని, గురువును అనుకొనుటంతయు నజ్ఞానము. సమస్త గృహము, పరివారము, ధనము నాది యనుకొనుట యజ్ఞానము.

బలరాముని తండ్రి:—చిత్తము.

శ్రీరామ:—ఎంతకాలము 'నీవే కర్తవు' అన్న జ్ఞానము కలుగదో అంతకాలము ఈ సంసారమున పరిభ్రమించుచు నుండవలయును. 'నీవే కర్త' వన్న జ్ఞానోదయానంతరము పునర్జన్మ ముండదు. ఎంతవఱకు 'తూంహు, తూంహు' అని వచింపరో అంతవఱకు కష్టము లే. అంతవఱకును పునర్జన్మము కలుగుచునే యుండును. ముక్తి యుండబోదు. 'నాది, నాది' యనినమాత్ర మేమి ప్రయోజనము. ఒకానొక ధనికుని నిర్వాహకుడు (Manager) 'ఇది నా తోట; ఇదియే నా పట్టెమంచము. ఇదియే నా గృహోపకరణ సందోహము అని పలుకవచ్చును. కాని యజమాని అతనిని ఉద్యోగమునుండి తొలగించినచో అచటినుండి యొక జాజికాయ పెట్టెను దీసికొనిపోవుటకు గూడ నతని కధికారముండదు. 'నేను, నాది' యన్న భావము ప్రతివస్తువును ఆవరించుకొని యున్నది. అద్వైతజ్ఞానము లేనిచో చైతన్యదర్శనము లభింపదు. చైతన్యదర్శనము లభించిననే నిత్యానందము. పరమహంసావస్థయందే నిత్యానందము ననుభవింపగలము. వేదాంతమతానుసారము అవతారములు లేవు. ఆ మతానుసారము శ్రీకృష్ణచైతన్యులు అద్వైతమునందలి యొకానొక బిందువు. చైతన్యదర్శన మెట్టిదో తెలియునా? అంధకారబంధురమగు గదియందు హఠాత్తుగా అగ్గిపుల్లను ముట్టించుటవంటిది. భక్తిమార్గాను యాయులే అవతారముల స్వీకరింతురు. ఒకప్పుడు కర్తాభజ సంప్రదాయమునకు జెందినయొక స్త్రీ నా యవస్థనుజూచి 'నీకు వస్తువు లభించినది. కావున ఇంకనీ యాటపాటలను వదలిపెట్టుము. బాగుగా బండిన ద్రాక్షపండ్లను మిక్కిలి జాగరూకతతో ప్రత్తిమీద నుంచవలయును. గర్భవతిగానున్న కోడలి పనులను అత్తగారు తగ్గించివైచును. కొంచెము కొంచెముగా కర్మత్యాగము కలుగుటయే భగవద్దర్శనము బడసినవారి లక్షణము. ఈ మనుష్యునియందు (శ్రీరామకృష్ణులయందు) మనుష్యరత్నమున్నది' అని వచించెను. 'నేను భుజించుచుండగా జూచి 'నాయనా, నీవే

† తత్ జ్యోతిషాం జ్యోతిః, తచ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతిః తద్యత్ ఆత్మ విదో విదుః.
—ముండకోపనిషత్తు, 2-2-9.

భుజించుచున్నావా? ఎవరికైన భోజనమిడు చున్నావా?' యని యడిగినది.

నేను అన్న జ్ఞానమే సత్యము నావరించి యున్నది. నరేంద్రుడు "ఈ 'నేను' ఎంత దూరముగా తొలగిపోవునో అంతంతకు భగవానుని నేను దగ్గరింతును" అని పలుకు వాడు. 'కుండలో మట్టి ఎంత యెక్కువగా నుండునో నీరు అంత తక్కువగా నుండు'నని కేదారుడు నచించువాడు. శ్రీకృష్ణుడు అర్జునుని జూచి, 'నాయనా, అష్టసిద్ధులలో ఒకటి యున్నను నీవు నన్ను పొందజాలవు' అని పలికెను. ఈ సిద్ధులవలన కొంచెము శక్తి కలుగ వచ్చును—వ్యాధి నివారణమువంటి విషయము లందు ఇతరులకు సాయము చేయవచ్చును, నిజమేనా?

'అందులకే దేవియొద్ద శుద్ధభక్తిని బ్రార్థించి తిని. సిద్ధిని గోరలేదు,' అని పలుకుచు శ్రీరామ కృష్ణులు సమాధిగతులైరి. సాధారణస్థితికి వచ్చిన పిదప ఒక పాటను బాడ నారంభించిరి. **పాట భావము:**

సఖీ! ఎవని ప్రేమ నన్ను పిచ్చిదానినిగా జేసెనో అతనిని కనుగొనజాలకున్నాను........

తరువాత రామలాలు నొక పాట బాడ గోరిరి. ఆయన గౌరాంగసన్న్యాసమును నెంచి పాడ నారంభించెను. **పాట భావము:**

ఆహా! కేశవభారతీ కుటీరమున ఎట్టి దివ్య దర్శనము ననుభవించితిని? అసాధ్యమయిన అనుపమజ్యోతి శ్రీ గౌరాంగమూర్తి. ఆయన చక్షుర్ద్వయమునుండి ప్రేమాశ్రువులు శతధారలుగా ప్రవహించెను. శ్రీ గౌరాంగుడు మత్తమాతంగము వలె ప్రేమావేశియై ఆడుచు, పాడును. క్రిందబడి పొరలాడుచు కన్నీటి కాలువలలో నీదుచు, సింహ గర్జనములతో స్వర్గమర్త్యముల భేదింపగల 'హరి హరి' యను శబ్దములతో బిలుచుచు నేడ్చును. మఱియు మిక్కిలి దీనభావముతో బద్ధాంజలియై దాస్యభావముకొఱకై భక్తిని గోరును. ముండిత మస్తకుడై, యోగివేషధారియై, భక్తిప్రేమావేశుడై యున్న ఆతనిజూడ ఎంతటి కఠినహృదయుడు గూడభావచకితుడగును. జీవకోటి దుఃఖముగాంచి దయార్ద్రహృదయుడై సర్వస్వమును త్యజించి భగవత్ప్రేమను వారికి పంచిపెట్టుట కేతెంచెను. అట్టి మహానుభావుడగు గౌరాంగుని చరణదాస్య మును ఆసించి వారి కీర్తనములు నింటింట పాడుచు దిరుగుటయే ప్రేమదాసు వాంఛ.

చైతన్యదేవుని ప్రేమోన్మాదవర్ణనానంత రము శ్రీరామకృష్ణుల యాజ్ఞానుసారము రామలాలు గోపికల ప్రేమోన్మాదావస్థను వివరించు మరియొక పాటను బాడెను.

శ్రీ తురీయానంద లేఖావళి

శ్రీహరిశరణమ్

ఆల్మోరా,
24-5-'15.

శ్రీమాన్ ...

శరీరమున్నంతవఱకు సుఖదుఃఖములు అనుభవించుచునే యుండవలయును—"నహ్యై సశరీరస్య సతః ప్రియాఽప్రియయో రపహతిరస్తి"* ఇది వేదవాక్యము. 'అశరీరం వావసంతం న ప్రియాఽప్రియే స్పృశతః.' అనగా ఈ శరీరమునందే అశరీరియగు నాత్మ కలదు. ఈ ప్రియాప్రియము లెవ్వియు దానిని స్పృశింపజాలవు. ఈ శరీరమే నేను అని తలంచుటవలనగదా సుఖదుఃఖములచే నాక్రమింపబడుచున్నావు! నేను శరీరమునుగాదు. అశరీరియగు నాత్మయే నేను అని తలంచుచు సుఖదుఃఖముల దరి ప్రయత్నించుటయే మేలు. ఇందువలన నెన్నియో కష్టములు లాఘవములగుననుట యందు సందియములేదు.

ఈ సంసారమున సమస్తమును చింతాఫలితమే. ఎవడెట్లు తలంచునో వాడట్లే యగును. సదా శరీరభావమున నుండుటకంటె నపుడపుడయినను అశరీరచింతను అనుసరించిన నెంతయో మేలు చేకూరు నవకాశము కలదు. ఏసుక్రీస్తు "He that has, to him shall be given. He that has not, from him shall be taken even what he has—ఎవనియొద్ద నున్నదో వానికింకను నొసగబడును. ఎవనియొద్ద లేదో వానియొద్ద నున్నదియును తీసికొనబడును" అని పలికియున్నాడు. శ్రీరామకృష్ణులవారుగూడ "ఎల్లప్పుడును 'ఎవడు నాకేమియు లభింపలేదు. నేను పాపిని' అను నిట్టి తలంపులు గలిగియుండునో వాడు నిజముగా పాపియే యగును" అని వచించెడివారు.

కావున నిరాశాహతుడవు కాబోకుము. అందులకు 'నేను భగవన్నామము జపించుచున్నాను. నాకు భయమేల?'—అన్న భావము కలిగింప బ్రయత్నింపవలయును. ఆయన కృపగలిగిన మన కష్టములన్నియు గట్టెక్కును. 'జయజయ జగదంబ' యని పలుకుచు తాళము వేయుచు ఆమె నామగుణగానము జేయ నారంభింపుము. అట్లు చేసినచో నీకు బలము చేకూరును. ఒకచోట బడుండియున్నచో అట్టే పడుండియుండ మనసు గోలుపును. ఎట్లో ఒకట్లు ఒకమారు కూర్చొకలిగినచో నిక పడుండ నిష్టము పుట్టదు. అపుడు పచార్లు చేయ తలపు గలుగును. అందులకే క్రీస్తు 'ఎవనికున్నదో వానికింకను నొసగబడును, ఎవనికి లేదో వానియొద్ద నున్నది సయితము తీసికొన

* సశరీరవ్యక్తికి అనగా ఎవనికి శరీరమునం దాత్మబుద్ధి గలదో ఆ వ్యక్తికి ప్రియాప్రియములనుండి- అనగా మంచిచెడ్డలనుండి తప్పించుకొను మార్గము లేదు.

బడును' అని పలికెను. మిక్కిలి ఉత్సా అవసరము. నిరుత్సా ంతను శ్రీ రామకృష్ణులు ఒప్పుకొనెడివారు కారు. పడి కొట్టి తీసికొనెడి భావమును ప్రేమించెడివారు. కావుననే శ్రీ వివేకానందస్వాముల వారు ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరాన్ని బోధత—మున్నగు ప్రచారమును గావించిరి. భయమేమియు లేదు. భగవానుని పిలువుము. ఆయన సమస్తమును చక్కబెట్టును. ఆయనయే మనకు గతి. ఆయనకు మించి యొక నెవరును లేరు. ఆయనయే మనకు మిక్కిలి కావలసినవాడు అను విషయమును దెలిసికొని ఆయనను ప్రార్థించినచో అన్నియు చక్కగా సరిపడును. శరీర మిపుడుండును. మరియొక సమయమున లేకుండును. భగవంతునినీవానినిగా భావించుకొనుము. ఆయనయెల్లప్పుడునుండువాడు.

నిరుత్సాహివి కాకుము. నిరంతరము భగవానుని మనస్సున నిలుప ప్రయత్నింపుము. మనస్సునకు చక్కని బలమును చేకూర్చుకొనుము. ఎల్లప్పుడు భగవన్నామస్మరణము చేయుము. ఆయనయే సమస్తమునకును ఆశ్రయస్వరూపుడు. నిన్ను సంపూర్ణముగ ఆయన శ్రీచరణముల కర్పించుకొని నిశ్చింతమై యుండుము. భయాది భావనలు తమంతట తామే మాయమై హృదయమున నవీన బల సంచారము కలుగును. జయ శ్రీ గురుమహారాజునకు జై!

నా శుభేచ్ఛా ఆశీస్సులు,

ఇట్లు,

శ్రీ తురీయానంద

ఓం నమో భగవతే శ్రీరామకృష్ణాయ!

శ్రీ బ్రహ్మానందస్వామి పారమార్థిక ప్రతిభాతిశయము

రి

శ్రీ చిరంతనానందస్వామి

శ్రీ బ్రహ్మానందస్వామి ప్రియశిష్యుడును ప్రస్తుతము అమెరికాదేశమున హాలీవుడ్ నందలి సుప్రసిద్ధ వేదాంత సంఘాధ్యక్షుడును నగు శ్రీ ప్రభవానందస్వామి వెలువరించిన (The Eternal Companion - Brahmananda—His Life and Teachings— బ్రహ్మానంద స్వామి జీవితోపదేశములు అను) గ్రంథమునం దొలినుడిలో స్వామి మహత్త్వమునుగూర్చి తెల్పిన విషయములు దివ్యావేశజనకములై యలరారుచున్నవి. ఆతం డిట్లు వ్రాసి యున్నాడు :

"బ్రహ్మజ్ఞానియగు మహనీయుని సందర్శించునెడ, అత్యద్భుతవిషయము సంఘటిల్లును, కేవల మాతని సాన్నిధ్యమే మాత్ర

యందలి మహత్త్వమును గుర్తింపఁజేయు నింద్రియాతీతమగు నొకానొక జ్ఞానమును నీ కొసఁగును. మహారాజు (శ్రీ బ్రహ్మానందస్వామి) మాకుఁ దన సన్నిధి లభించినప్పుడెల్ల నిట్టి జ్ఞానము నొసఁగుచుండువాఁడు. మా మనస్సు సముద్ధరింపఁబడ, నాతని యాంతరిక దివ్యస్వభావము క్షణకాలము మాకు గోచరించెడిది. కాని యీ క్షణికసందర్శనములు అసంపూర్ణములు. స్వయముగా సాక్షాత్కారసంపన్నులగు స్వామిసోదరశిష్యులు స్వామిశిష్యులమగు మాకంటె శతగుణాధికముగా నాతని దివ్యతత్త్వము నరయఁగల్గెడివారనుటకు సందియము లేదు. చెన్నపురి శ్రీరామకృష్ణ మఠ సంస్థాపకుఁడును తదధ్యక్షుఁడునై యొప్పిన శ్రీ రామకృష్ణానందస్వామి బ్రహ్మానందస్వామిని శిష్యులకుఁ బరిచితు నొనర్చుచు నొకప్పు డిట్లు వచించియున్నాఁడు: 'మీలో నెవ్వరును శ్రీ రామకృష్ణునిఁ గాంచకున్నను, ఇపుడు మహారాజును గాంచుచున్నారుకదా? అదియు నిదియు నొక్కటియేయని గ్రహింతురుగాక!' మఱియొకప్పు డొకభక్తుఁడు ఆలయమున శ్రీ రామకృష్ణభగవానున కర్పింపఁగోరుచు నొకఫలమును గైకొని రాఁగా, శ్రీ రామకృష్ణానందుఁ డతని నా ఫలమును మహారాజున కర్పింపుమని తెలుపుచు, 'దీనిని శ్రీ రామకృష్ణుని కర్పించుటెట్టిదో మహారాజున కర్పించుటయు నట్టిదేసుమీ!' యని వక్కాణించి యున్నాఁడు.''

ఒకనాఁడు శ్రీ ప్రభవానందస్వామి మహారాజు తనతోఁ జెప్పిన విషయము నంగీకరింప సంకోచించుచుండెను. అప్పుడచట నుండిన శ్రీ శివానందస్వామి వెంటనే మహారాజుతో నేకీభవించు టాతని కామోదకరము కాలేదు. పిమ్మట నాతఁ డొంటరిగా శ్రీ శివానందస్వామితోఁ సంభాషించుచు, నాతఁడు మహారాజు చెప్పినదానికెల్లఁ దల యూఁపు వ్యక్తి యని తన మనసులోఁ గల యభిప్రాయమును జనవుచే వెల్లడింప, శ్రీ శివానందస్వామి నవ్వుచు నిట్లు పలికెను: ''నాయనా! నీ కేమి తెలియును? నీవు మహారాజును మహారాజుగా మాత్రమే కనుచున్నావు. కాని బాహ్యమున మేము మహారాజురూపమును గాంచుచున్నను, ఆతఁడు అంతరంగమున భగవత్పరిపూర్ణుఁడై వెల్గొందుచుండుట గాంచుచున్నాము. మహారాజు నీ కేమి చెప్పినను, అయ్యది సాక్షాదీశ్వరవాణియని గ్రహింపుము.'' ఇది స్వయముగా బ్రహ్మసాక్షాత్కారము నందిన మహనీయుని—పూజ్యపాదుఁడగు శ్రీ వివేకానందస్వామిచే మహాపురుషుఁడని సంబోధింపఁబడిన ఋషివరేణ్యుని—మహోపదేశముగా గ్రహించినచో, నెంతటి యమూల్యాభిప్రాయమో తెలియఁగలదు.

మహారాజొకనాఁడు చెన్నపురినుండి వెడలుటకై పంచాంగము చూచి శుభదినము కనుఁగొనుమని శ్రీ ప్రభవానందస్వామితోఁ జెప్ప నాతఁ డటు లొనర్చుచుఁ దనలోఁ దాను నవ్వుకొనుచుండుటయుఁ దన ముసిముసినవ్వుల నాఁపుకొనఁజాలకుండుటయు మహారాజు గమనించి, 'నీ వినోదకారణమే' మని యడుగ నాతఁ డిట్లు పలికెను: ''బాగుగనే యున్నది కానిండు, స్వామీ, మీ రెచటికైనను వెళ్లఁ దలఁచుకొనునపుడెల్ల, ఈ తంతు జరుపుచుందురు; కాని మఱియొకనాఁడు ప్రయాణమగుటకై యకస్మాత్తుగా నిర్ణయించుకొనుచుందురు.'' మహారాజందుల కిట్లు సమాధానించెను: ''కేవలము నా సంకల్పము ననుసరించి

నే నేమైనను జేయుచుందుననియా నీ యభిప్రాయము? నా ప్రయాణమున కేదియో యొక దినము నిర్ణయింప భక్తులు నిక్కచ్చిచేయుచుందురు; నిరంతరమైన యీ పీడ తొలఁగించుకొనుటకై యప్పటికప్పుడు ప్రయాణయోగ్యమైన యొకదినము నిర్ణయించుచుందును. కాని, భగవత్సంకల్పము తెలియనిదే కదలను; ఏ పనియుఁగూడఁ జేయను.''

ప్రభ.: ''అగుచో, సదా భగవత్సంకల్పముచేతనే ప్రేరితులై వర్తించుచుందురనియా మీరు చెప్పెడిమాట?''

మహారాజు: ''ఔను.''

ప్రభ.: ''సరియేకాని, స్వామీ! వాస్తవమరయఁబోయిన, కేవలము నా మనఃప్రవృత్తులను సంకల్పములను అనుసరించుచు వానినీశ్వరసంకల్పమున కారోపించుచు నేనును ఈశ్వరసంకల్పానుసారము వర్తించుచుంటి ననుకొనవచ్చును. ఇదియే కాదా మీరు చేయునది?''

మహారాజు: ''కాదు, నాయనా! అది కాదు.''

ప్రభ.: ''అగుచో, మీరు ప్రత్యక్షముగా భగవంతుని దర్శించి వానితో సంభాషించి వాని సంకల్పమును దెలిసికొనుచుందురన్న మాట.''

మహారాజు: ''ఔను, ప్రత్యక్షముగా వాని సంకల్పము దెలిసికొనుపర్యంతము వేచియుందును; నాకర్తవ్యమును భగవంతుఁడు నాకుఁ జెప్పును.''

ప్రభ.: ''మీరు చేయు ప్రతికార్యమునను గూడనా?''

మహారాజు: ''ఔను, నేఁ జేయు ప్రతి కార్యమునను ప్రత్యక్షముగా భగవత్ప్రేరణ పొందుచుందును.''

ప్రభ.: ''మఱి మీ రెవరిని శిష్యులుగా స్వీకరింప భగవంతుఁడు మీకుఁ దెల్పునో వారినిమాత్రమే స్వీకరించుచుందురా?''

మహారాజు: ''ఔను.''

మహారాజుతో ఈ సంభాషణానంతరము శ్రీ ప్రభవానందస్వామి కాతని విచిత్రవర్తన విధానమునకు అర్థము గోచరింపసాగెను. శిష్యులలో నెవ్వరైనను ఏదేని ముఖ్యవిషయమును గూర్చి మహారాజు నాదేశమునుగాని హితోపదేశమునుగాని యర్థించునెడ నాతఁడు, ''ఉండుము. నేఁడు నా ఆలోచనాశక్తి పాఱుట లేదు'' అనియో, ''నాకు అజీర్తిచేసినది, రేపు సమాధానింతును లెమ్ము'' అనియో చెప్పును. ఒకొక్కప్పుడు శిష్యుఁడు ఇదమిత్థమైన సమాధానము నొందుటకుముం దెన్నియో 'రేపులు' గడచెడివి. కాని స్వయముగా ఈశ్వరవాణి నాలకించి తుదకు మహారాజు సమాధానించునపు డా వాక్కులమోఘములై యొప్పెడివనుట ఆశ్చర్యము కానేరదు.

గోపాల్ మా

శ్రీ దుప్వూరి రామకృష్ణారావు, బి. ఏ.

శ్లో. యే యథామాం ప్రపద్యన్తే
తాం స్తథైవ భజామ్యహమ్।
మమ వర్త్మాను వర్తన్తే
మనుష్యాః పార్థ సర్వశః॥ —భ. గీ.

ఈశ్వరసాక్షాత్కారము లేక మోక్షము సంపాదింపవలెనన్న దానికెన్నియో మార్గములు. ఇదమిత్థమనరాదు. మనఃపూర్వకముగ నేమార్గము ననుగమించినను గమ్యస్థానమును జేరగలము. శ్రీకృష్ణపరమాత్మ గీతలో నర్జునున కుపదేశించినటుల నేప్రకారముగ నెవరు తన్ను ఆరాధించుచున్నారో, తాను వారల నాలాగుననే యనుగ్రహించును. ఈ కాలమున మోక్షప్రాప్తికి భక్తిమార్గము తగినది. సగుణోపాసన ముక్తిమార్గమునకు జక్కని రాజబాట.

శ్రీరామకృష్ణులిటుల జెప్పువారు: "మొదట భక్తిని సంపాదించినచో మిగిలినవన్నియు నీకు దేలికగ జేకూరును. భక్తి యనునది భక్తుని చేతి త్రాటివంటిది. ఈ పాశము ఈశ్వరుని (సచ్చిదానందమును) భక్తునియందు బంధించును. కాని, ప్రేమభక్తి మానవునకు దేవునకు మధ్య నెటుల వృద్ధియగునని, నిరువురకు నొక సంబంధము నేర్పాటుచేసికొనుటచేతనే. శాస్త్రములు, భక్తియోగమునందు భక్తునకు నీశ్వరునకు వివిధములగు సంబంధములు చెప్పుచున్నవి. వైష్ణవ ప్రపత్తియందు శాంత, దాస్య, సఖ్య వాత్సల్య, మధురభావముల, నేవిధమగు భక్తి మార్గముచేనైన, నీ సంబంధమును పెంపొందింపవచ్చునని చెప్పబడియున్నది. యోగమున, యోగులకు దేవతాదర్శనములు ప్రత్యక్షములే కాని కలలు గావు. శ్రీమద్భాగవతమున యశోదాదేవి, గోపీనందనుని దన బ్రహ్మ గోపాలునిగ వాత్సల్యభావమున నారాధించి, కైవల్యమును గాంచుట మనకు తెలిసిన విషయమే. రామలాలు లేక రఘునందనుని వాత్సల్యభావమున నారాధించి, శ్రీరామకృష్ణుల కృపచే జటధారి యనునతడు తరియించిన విషయము రామకృష్ణ లీలామృతమున గాంతుము. మనకు ప్రత్యక్ష ప్రమాణముగ, "గోపాలుని తల్లి" యను పౌరుష నామమును బొందిన అఘోరమణిదేవి, వాత్సల్యభావమున "బాలగోపాలు" నుపాసించి, శ్రీరామకృష్ణులమూర్తియందు సారూప్యభావమును గాంచుచు, పరాప్రేమభక్తిపారవశ్యముచే లభించిన యోగసిద్ధియు, నామె జీవితఘట్టములందు యుగావతారుడగు పరమహంసదేవులు మన కండ్లముందర సత్యోద్భూతముగ నటించిన బాలగోపాల లీలాదర్శనములును నతిరమణీయములు.

అఘోరమణీదేవి పూర్వాచారపరాయణమగు బ్రాహ్మణకుటుంబమున బుట్టినది. చిన్ననాటనే వివాహమైనది. వివాహిత కాగనే భర్తృవియోగము సంభవించెను. కావున, నామె సోదరుడగు నీలమాధవముఖోపాధ్యాయుని యింటియొద్ద నివసించుచుండెను. ఈతడు కలకత్తాయొద్ద పటోల్‌డంగా నివాసియగు గోవిందచంద్రదత్తునకు బురోహితుడు. దత్తునకు దక్షిణేశ్వరమునకు మూడుమైళ్లదూరమున నున్న కమర్‌హాటి గ్రామమున గంగయొడ్డున రాధాగోవిందుని దేవాలయము గలదు. దత్తుగూడ త్వరలోనే చనిపోయెను. దత్తు భార్య గొప్ప భక్తురాలు. ఆమెకు నఘోరమణికిని స్నేహము. అందువలన నిద్దరు నా దేవాలయముననే నివసింప నారంభించిరి. ఈ దేవాలయ స్థలముననే, అఘోరమణి యొకగదిలో తానొక్కతెయే కాలక్షేపము జేయుచు, బ్రశాంతి ననుభవించుచు, గంగను జూచి యానందించుచు, రేయింబవళులు తన యిష్టదేవతారాధనతో గాలము పుచ్చెడిది. ఆమె వైష్ణవ ప్రపత్తి గల బ్రాహ్మణ కుటుంబమునం బుట్టి, వైష్ణవ గురువువలన బాలకృష్ణోపదేశమును బొంది, యీ యిష్టదేవుని దన బిడ్డనిగా నారాధించుచుండెడిది. ఇట్లు ముప్పది సంవత్సరములు తన యిష్టదైవమగు బాలగోపాలము నుపాసించుచుండెను.

ఇంతలో దక్షిణేశ్వరమునందున్న శ్రీరామకృష్ణుల పేరు ప్రతిష్ఠలు చాల దూరము వ్యాపించి, అఘోరమణి చెవికి నీ విషయము వినబడగనే యామెయు, గోవిందబాబు భార్యయు శ్రీరామకృష్ణుల దర్శనమునకై దక్షిణేశ్వరమునకు వెళ్లిరి (1884). శ్రీరామకృష్ణులు వీరినిజూచి, చూడగనే, పరిచితులుగ వారిని గ్రహించి, వారిని తనగదిలోనికి దోడ్కొనివెళ్లి, భక్తిలేక ప్రేమయే యీ జీవితమునకు బరమావధి యని చెప్పి, భక్తిపురస్సరమగు కొన్ని కీర్తనలను బాడెను. అంత వారు శ్రీరామకృష్ణుల సెలవు గైకొన, పరమహంసదేవులు మామూలు ధోరణిగ, "మరచిపోక, మళ్లీ వస్తారుగదా" యనిరి. వీరును శ్రీరామకృష్ణులను తమ దేవాలయోద్యానమునకు రా వేడుకొనిరి. రామకృష్ణులా దినమున వారిద్వరగూర్చియు, వారి నిరాడంబర భక్తినిగూర్చియు, అఘోరమణిదేవికి బాలకృష్ణునందు గల ప్రేమనుగూర్చియు విస్తారముగ బ్రశంసించిరి.

ఈ ప్రథమ సందర్శనమున శ్రీరామకృష్ణులయందు గోపాలుడున్నాడనిగాని, వీరలకు బరస్పరమగు గాఢమైన ప్రేమానురాగ సంస్కారములుండియున్నవనిగాని గోపాల్ మా యనుకొనలేదు. ఆ కలిసిన దినమునుండియు అఘోరమణిదేవి మనస్సు శ్రీరామకృష్ణులచే దీవ్రముగ నాకర్షింపబడుచునే యున్నది. శ్రీరామకృష్ణులు చాలమంచివారు. నిజమగు భక్తులు, తిరిగి వారిని సందర్శింప బ్రయత్నింపవలెనని మాత్రమే యామె యనుకొనెను. అచిరకాలముననే, యొకనాడు ధ్యానముచేయుచుండ, దక్షిణేశ్వరము పోయి యా రామకృష్ణులను సందర్శింపవలెనని గాఢమగు వాంఛ యామెకు గలిగెను. ఈ దివ్యోన్మత్తుడగు పురుషునిం జూడక యెట్లుండగలదు! వెంటనే యచ్చట దొరకెడి నిలువమిఠాయినే కొని, యొక్కతెయే దక్షిణేశ్వరమునకు వెళ్లెను. ఆమె రాకను జూచుచుండగనే శ్రీరామకృష్ణులు, "ఓ! మీరు వచ్చినారా! నాకు దెచ్చినది నాకు బెట్టుడ"నియె. ఆమె కేమిచేయుటకు దోచ

లేదు. ఆ నిలువ మిఠాయి వారి కెటుల ఇచ్చుట! ప్రతిదినము నెందరో రామకృష్ణు లకు మంచి మంచి పదార్థము లిచ్చెదరే! రామకృష్ణు లెటువంటి సాధువయ్యా; ఆమె రాగనే తనకు దినుట కేమైన బెట్టుమనినాడు. అనుమానించుచు, ననుమానించుచు భయము తోడను, లజ్జతోను దాను దెచ్చినవానిని వారికి సమర్పణచేసెను. దానిని రామకృష్ణులు పిల్లవానివలె నతిసంతోషముగ, నాప్యాయ ముతో దిననారంభించెను.

"బజారులో, నీ వస్తువులు కొని డబ్బు నక్లెందులకు ఖర్చుచేసెదవు. నీవు లస్కోరా వుండలను జేసి యొకటో రెండో నాకు దీసికొని రమ్ము. లేదా, నీవు వండిన శాకపాకములను గొలదిగ నాకు దీసికొనిరమ్ము. నీవు పచనము జేయు పదార్థములను దినుటయందు నా కెక్కువ ప్రీతి" యని రామకృష్ణు లామెతో పలికిరి. శ్రీరామకృష్ణు లటుల బసిబిడ్డని చందాన, నిదికావలె, నదికావలెనని, యఘోర మణిదేవిని జికాకుచేయ, గోపాల్‌మా రామ కృష్ణు 'లిదేమి సాధువయ్యా! దేవునిగూర్చి మాటలాడక తిండో, తిండో యను వాంఛతో నా వెనుకబడినారు. నేను దరిద్రురాలను. ఎటుల నెచ్చియియ్యగలను? సరియే ఇక నేను రానే రాను'అని యిలుసేర నెంచెను. కానిరామకృష్ణుల వైపునకు ప్రేమపాశము లామెను లాగుచునే యున్నవి. ఇంటికివెళ్ల బోవును గాని, యామె కాళ్లు వెనుకకు లాగుచునే యున్నవి. ఎటులనో యిలుసేరెను. తిరిగి త్వరలో నామె యొక కూరను వండి దొప్పలో పెట్టుకొని మూడు మైళ్లు నడిచి దక్షిణేశ్వరము చేరెను. ఎప్పటి వలెనే రామకృష్ణు లామె నా పదార్థమును దనకిమ్మని వేడుకొని, యమిత సంతోషము పొంది, దాని నారగించెను. ఇటుల నేదియో యొకటి వారి కామె తీసికొనివెళ్లుటయు, రామ కృష్ణు లెప్పటి కప్పుడే యొక క్రొత్త పురమా యింపు నామెను తీసికొని రమ్మనుటయు మామూలైపోయినది. శ్రీరామకృష్ణుల పోకడ లామెకెంతయు చీకాకుగనుండి, యొకనాడు తన యిష్టదేవున కిట్లు విన్నవించెను: "ఇదేమి గోపాలా! నేను నిన్ననుక్షణము స్మరించుకొను చుండుటచేతనా, యేదో యొకటి తినుటకై ప్రాకులాడు సాధువుదగ్గరకు రమ్మని ప్రోద్బలము చేయుచుంటివి? అతనియొద్దకు నే నెన్నడును రాను." ఇటులనుకొననే గాని యామెకు రామకృష్ణులయెడ ననివార్యమగు, చెప్పరాని యనురాగము తనలో బనిజేయుచునే యుండెను. వారికి దూరముగాగనే, రామ కృష్ణుల దర్శనమునకు వెళ్లవలెనను ధ్యాస యామెను బీడించుచునే యుండెడిది.

ఇంతలో రామకృష్ణు లఘోరమణిదేవి నివసించు కమరహతి దేవళమును జూచుటకు వెళ్లెను. ఆ దేవతావిగ్రహముయొద్ద జరుగు చున్న నిత్యసేవలజూచి, వానిని బ్రశంసించుచు, దానుగూడ నచ్చట భజనకీర్తనలను బాడి, భోజనముచేసి, దక్షిణేశ్వరమునకు దిరిగివచ్చెను. ఆ కీర్తనలను వినినవారందరు ఆ శ్రావ్యతను గ్రోలుచు, శ్రీరామకృష్ణులు తరచు తన్మ యులై యుండుటను గాంచుచు నానంద పరవశులైరి.

అఘోరమణి రాత్రి రెండుగంటలకు లేచి, యుదయ మెనిమిది తొమ్మిది గంటలవరకు జప మాలను ద్రిప్పును. జపమునుండి లేచి, దేవా లయపు బని పూర్తిచేసికొనిన పిమ్మట, వంట చేసి దానిని దేవునికి నివేదనచేసి, యాప్రసాద మును దాను పుచ్చుకొని, కొంచెము నెమ్మ

దించెడిది. తిరిగి లేవగనే, సాయంకాలము వరకు జపముచేసికొని, సాయంకాలము దేవతా రాధనచేసి తిరిగి జాలరాత్రివరకు జపము జేసెడిది.

1885–వ సంవత్సరము వసంతఋతువున నొక రాత్రి మూడుగంటలవేళ, జపముచేసికొని యా జప ఫలితమును గృష్ణార్పణము జేయుచుండ, నామె యులికిపడ, నామె యెడమప్రక్కను శ్రీరామకృష్ణులు తన కుడి గుప్పిలిని ముడిచికొని కూర్చొనియుండునట్లు దర్శనమైనది. ఆమె దక్షిణేశ్వరమునందు వారిని జూచినంత స్పష్టముగ, జీవకళతో బ్రత్యక్షముగ నామెకు ద్యోతకమయ్యెను. రామకృష్ణు లా వేళగాని వేళ నచటకు వచ్చుట కెటుల వీలుచిక్కినదియు నామెకు దెలియకుండెను. ఆమెను జూచుచు రామకృష్ణులు ముసి ముసి నవ్వుల నవ్వుచుండ నామె విస్మయపడుచుండెను. కొంతవరకు గుండె ధైర్యము తెచ్చుకొని, రామకృష్ణుల చేతి నామె బట్టుకొనబోయెను. కాని యా రూప మదృశ్యమై, పదినెలల పాపడు వారినుండి యావిర్భవించుటను గాంచెను. ఆ పాపడు నిజముగం దన గోపాలుడే! ఆతడు తన మోకాళ్లు, చేతులపై నెగబ్రాకుకొనుచు, నామెవంకకు వచ్చి, యొక చేతినెత్తి, యామెను తేరపారిచూచుచు, వచ్చియు రాని మాటలతో "నమ్మా! నాకు మీగడ పెట్టవా" యని యడుగ నారంభించెను. ఆ నిర్జన యేకాంతవాసమున నామె యెలుగెత్తి బిగ్గరగ కేకలువేయ నారంభించెను. ఆ సంభ్రమోల్లాసముచే మైమరచిన యామె స్థితి నూహించుటకంటె, నా వర్ణనాతీతమగు సన్నివేశము కొంతగ నామె చెప్పినది తెలిసికొనుటయే మంచిది. ఆమె యిట్లు ఏడ్వ నారంభించెను, "నా ముద్దుల చిన్నా! నేను బీద దానను. నీకు వెన్న, మీగడల నెచ్చటనుండి తెచ్చి పెట్టగలను." కాని వింతగ గోపాలు డామె మొరలకు సమాధానపడడుగదా! ఆత డామెను మరల మరల నేమైనం బెట్టుమని యడుగుచునేయుండెను. ఏమి చేయగలదు. ఏడ్చుచు నామెదగ్గర గట్టిపడిపోయియున్న కొబ్బరి నౌజుటుండలనుదెచ్చి, యాతని కారగింపుజేయుచు, "నేనింత దరిద్రపు వస్తువును నీకిచ్చుచున్నాను. నాకట్టివానిని నీవియ్యతగదు సుమీ" యనియె. అంత గోపాలుడు తృప్తి పొందెను. ఆమె జపమునకు దిరిగి కూర్చొన బోయెను. కాని తన గోపాలు డది సాగనీయడే. ఆమె తొడలపై గూర్చొనును; తావళమును లాగికొనును; భుజములపై కెక్కును; ఆమెతో నాటలాడును; గదియంతయు బ్రాకుచుండును. తెల్లవారగనే అఘోరమణిదేవి పిచ్చిదానివలె దక్షిణేశ్వరమునకుం బోయెను. గోపాలు డామె భుజముపై తలపెట్టుకొని వెంటబడెను. ఆ గోపాలుని లేత కెంజాయరంగుగల చిన్ని పాదము లామె వక్షస్థలమున విస్పష్టముగ వ్రేలాడ, నామె యాతని తన రొమ్ముల గట్టిగ హత్తుకొనెను. భక్తులతో నీశ్వరు డీవిధముగనే విహరించును.

దక్షిణేశ్వరమున శ్రీరామకృష్ణుల సన్నిధి జేరియు, జేరకుండగనే, యఘోరమణిదేవి, "గోపాలా, గోపాలా" యని వెఱ్ఱికేకలు వేయుచుండెను. ఎవరి కేకలా యని, శ్రీరామకృష్ణుల గది నూడ్చుచున్న గోలప్మా, పరిచితముగు ఆ కంఠధ్వనిని వినగా నామె తన యఘోరమణియే. ఆమె జుట్టు విడిపోయి, తేలచూపుల జూచుచు, చీరకొంగు జీరాడుచుండెను. తన శరీరమును, ప్రపంచమును మరచి కేవల నిర్జీవముగనుండి, తూర్పు గుమ్మ

మున శ్రీరామకృష్ణులుండు గదిలో ప్రవేశించెను. ఇదంతయుజూచి గోలప్ మా నిర్ఘాంత పోయెను. శ్రీరామకృష్ణులు తన చిన్నమంచముపై కూర్చొనియుండిరి. ఇంతలో శ్రీరామకృష్ణులు పరవశులైరి. అఘోరమణి వారి చెంత జేరి కూర్చొనెను. వెంటనే, రామకృష్ణు లొక బిడ్డనివలె నామె తొడలపై గూర్చొనెను. ఆమె కంటినుండి యానందబాష్పము లపరిమితముగ గారజొచ్చెను. ఆమె తెచ్చిన వెన్న, మీగడ, భక్ష్యములను, నతడే గోపాలుడను భావముతో దినిపించుచుండెను. ఇదివరలో నెన్నడో, తన గురువగు భైరవీ బ్రాహ్మణి తాను యశోదా దేవియందలి భావదీప్తినుండ, గురుదేవు లామె తొడలపై గోపబాలునివలె గూర్చొనియుండుట వినికిడి. కొంతసేపటికి శ్రీ రా మ కృ ష్ణు లు మామూలు స్థాయిలోకి వచ్చి తమ యాసనమును జేరుకొనిరి. కాని, యఘోరమణికి శరీర స్మృతి రాలేదు. ఆ యానందపారవశ్యమున వెఱ్ఱిదానివలె నాట్యముజేయ నారంభించెను. ఆమె తన గోపాలుడు రామకృష్ణులయందు లీనమగుట, తిరిగి వారి శరీరమునుండి బయటకు వచ్చుట, తన చేతులలోనే యున్నాడనుకొనుట, యామెతో నాటలాడుట తాను గాంచుచుండెను. ఆమె రామకృష్ణులతో వినియు విన బడని మాటలతో నిట్లనియె: "ఇడిగో నా తొడలపై గోపాలుడు, తిరిగి నీలోనుండి వచ్చుచున్నాడు. ఓ గోపాలా! దుఃఖితయగు నీ తల్లి యొద్దకు రమ్ము." ఇదంతయు మందహాసముతో రామకృష్ణులు జూచుచుండెను. "అఘోరమణి గోపాలుని చేష్టలను నటించుచు, నా యానందములో మునిగియున్నది గోపాలలోకమున నామె మనస్సు విహరించుచున్న"దని రామకృష్ణులు గోలప్‌మా తో ననియెను.

ఆమె ఆ దివ్యానందమున నుండ, శ్రీరామకృష్ణు లామె యుపశాంతికై, తన చేతితో నామె వక్షము నిమురుచు, నా గదిలోని భక్ష్యముల నామెకు బెట్టి, యామె యద్వితీయమగు ననుభూతిని అభినందించిరి. ఈ భక్ష్యములను దినుచుండిన, నామె యింకను నానందముతో బరవశయై యిట్లనుచుండెను: "నా ప్రియమైన గోపాలా! నీ తల్లి యీ లోకమునందు బహుకష్టజీవి. ఆమె నూలువడకి బ్రదుకవలసి వచ్చినది. అందులకేనా నీ వింత ముద్దుగ నుంటివి." నాటినుండియు, నఘోరమణిదేవికి గోపాలుని తల్లి లేక గోపాల్‌మా యనునది వ్యావహారిక బిరుదైనది. ఆమెయు, నంతట నుండి శ్రీరామకృష్ణులను దన బాలకృష్ణునిగనే గ్రహించెను.

గోపాల్‌మా చే స్నానము చేయించి, భోజనమిడి, యా దినమంతయు దక్షిణేశ్వరముననే నుంచి, సాయంకాల మామెను శ్రీరామకృష్ణులు కమర్హాటికి దిరిగి పంపివైచిరి. త్రోవ పొడుగున స్పష్టముగా నామెకు ద్యోతకుడైన బాలగోపాలుడు తనచేతులపైననే హత్తుకొనగ, తనతోడనే తిరిగి వచ్చెను. రాత్రి తన జపమును జేయుటకు గూర్చొనెను. కాని, గోపబాలుడు తావళమును త్రిప్పకుండ, నామె జపము సాగకుండ నవరోధములు గల్పించుచునే యుండెను. ఇంక నామె కుపాసన లెందుకు. ఆమె జీవితమంతయు నెవనికొరకు దపస్సు చేయుచుండెనో, యా స్వరూప మామె కట్టెదుట దాండవించుచుండెగదా! అంత లేచి, గోపాలుని దనపక్కలో పెట్టుకొని పరుండబోయెను. కాని తన ప్రక్క గట్టిగ నున్నదనియు, దలగడ లేదనియు గోపాలుడు మూలుగ నారంభించెను. ఆమె గోపాలుని దగ్గరకు దీసికొని యాతని

చిన్నతలను దనచేతిపై బెట్టుకొని, "నా బాలా! యీరాత్రి క్లిగడపుము. రేపు నీకు మెత్తని తలగడను కలకత్తానుండి తెచ్చెద" నని యాతని నూరుకొనబెట్టెను. మరునాడు గోపాలుని వంటకు ఆమె యెండుకట్టెలకై వెళ్లెను. గోపాలుడు నామెతో వెళ్లి యామెకు సాయపడెను. అంత నామె వంట ప్రారంభింపగా, నా పెంకివాడామెతో దమాషాలు చేయుచుండెను. ఆమె గోపాలుని నొకప్పుడు ముద్దులాడుచు, నొకప్పుడు తన స్తన్యమిడుచు, మరియొకప్పుడు గద్దించుచుండెను. శ్రీరామకృష్ణులు అప్పటికి అరువది సంవత్సరముల వయస్సు మీరిన గోపాల్‌మా యనుభవములు మనోవికారములు కావనియు, నవన్నియు యథార్థము లనియు శిష్యులతో జెప్పిరి.

ఈ యనుభూతి నొందుటచే గోపాల్‌మా తరచుగా దక్షిణేశ్వరము వెళ్లుచుండెను. ఆహార విషయముల, శుభ్రత విషయముల నామె కదివరకు గల విపరీతమగు ఛాందసము తగ్గినది. పూర్వాచార పద్ధతు లామె కసాధ్యములైనవి. ఆమెకు గోపాలుడే ప్రత్యక్ష గురువు. ఆ దివ్య బాలుడు చీటికి మాటికిం దినునిచ్చు; అడపదడప ఆహారములో గొంత నామెకు నోటిలో బెట్టెడివాడు. దాని నామె యెటుల వద్దనగలదు? వద్దన్న గోపాలు డేడ్చునే! ఇంతేకాక యిదంతయు రామకృష్ణుల పనియనియు, దన గోపాలుడు నిశ్చయముగ నాయనయే యనియు నమ్మిక కల్గి, శ్రీరామకృష్ణులు ముట్టిన యాహారము నామె పుచ్చుకొనుట కెట్టి శంకయు పడకుండెను. చాల సంవత్సరములుగ సునిశ్చలమగు సాధనచే, గోపాలుని తల్లికి తన పరమావధి సిద్ధించినది. గోపాలునియెడ నామెకు గల యభినివేశమువలన భగవంతు [illegible] రూపమును వాస్తవముగ ధరించి [illegible]రా, నామె బాలకృష్ణునితో బ్రత్యక్షముగ జీవితమును గడపుచు, సంచరించుచు, నిరువదినాలుగు గంటలు నా తన్మయావస్థలో నుండెడిది. గోపాలు డొక్కక్షణమైన నామెను వదలియుండలేదు. అట్టి దివ్యదర్శన మదృష్టవంతులగు కొందరికి మాత్రమే లభింపగలదు.

(సశేషము)

కూజాను నిండుగా నింపి ఉట్టిమీద బెట్టియుంచుము. కొలది దినములలో నీరంతయు ఇగిరిపోవును. కాని దానినే నీటిలో నుంచితివేని, అటు లచట నున్నంతకాలము నిండుగనే యుండును. నీ భగవద్భక్తి విషయముకూడ నిట్టిదే. కొంతకాలము భక్తిసాధనచేసి, పిమ్మట ఆ విషయమే మఱచి, యితర వ్యవహారములలో దిగినపక్షమున నీ హృదయమందలి భక్తి రసమంతయు హరించిపోవును. కాని నీ యానందమయ హృదయమును పవిత్ర భక్తివిశ్వాసము లను నమృతసాగరమున సదా ముంచియుంచితివేని వానితో నెప్పుడును పరిపూర్ణమై యొప్పుచుండును.

—శ్రీ రామకృష్ణ పరమహంస

శ్రీ వాసుదేవ మననము

ప్రథమ వర్ణకము

శ్రీ మాచిరాజు శ్రీరామకృష్ణ

(గతసంచిక తరువాయి)

అటుతరువాత సూక్ష్మప్రపంచసృష్టి చెప్పబడుచున్నది. ''సోఽకామయత, బహుస్యాంప్రజాయేయేతి॥'' (తై. ఉ. 2-6-3) సః=ఆ బ్రహ్మను, బహుస్యాం = దేవ తిర్యఙ్నరాది నానావిధ రూపములుగా నగుదును. ప్రజాయేయ=అందుకొఱకు పాంచభౌతిక రూపములుగానగుదును. ఇతి అకామయత=అని కోరెను. ''తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి॥'' (ఛాం. ఉ. 6-2-3) బహుస్యాం=ప్రకృతి మహదహంకార పంచతన్మాత్ర పంచమహాభూతైకాదశేంద్రియ రూపములగు ఇరువదినాలుగు అచిత్తత్త్వములును, ఇరువదియైదవ తత్త్వమగు చిత్తునుగల ఈ యుభయ మిళితమైన జగద్రూపమగు వ్యష్టి సృష్టిగా నయ్యెదను. ప్రజాయేయ=పై వ్యష్టి సృష్టికి సాధనములుగ ఆకాశాది పంచభూత రూపమగు సమష్టి రూపమైన సృష్టిగా నయ్యెదను. ఇతి తత్ ఐక్షత=తత్ సత్ ఐక్షత ఈక్షాం, దర్శనం, కృతవత్=అని యా పరబ్రహ్మము ఈక్షణము జేసెను. 'బహుస్యాం' అనుటవలన విచిత్రానంత చిదచిన్మిశ్రవ్యష్టి జగద్రూపముగ వ్యష్టి సృష్టియు, 'ప్రజాయేయ' అనుటవలన భూజలాది పంచభూతరూప సమష్టి సృష్టియు వివక్షితమని సూచితము. 'అకామయత' 'ఐక్షత' అనెడి కథనమువలన, రజ్జ్వాదికము భ్రాంతిచేత సర్పాద్యాకారమున గ్రహింపబడిన విధమున నాత్మయే స్వాజ్ఞాన మూలమున ననేకమైన ద్వైతభేదమున గ్రహింపబడుచున్నదని గ్రాహ్యము; అను నిత్యాది శ్రుతులు ప్రమాణముగ ఈశ్వరుని యొక్క ఈక్షణ వశమువలన తమోగుణరూపమైన ప్రకృతి, ఆవరణశక్తివిక్షేపశక్తియని రెండు విధములయ్యెను. ''విక్షేపశక్తిర్లింగాది బ్రహ్మాండాంతం జగత్సృజేత్। అవృణోత్యపరాశక్తిస్సా సంసారస్య కారణం॥'' (సరస్వతీరహస్య.ఉ.) విక్షేపశక్తి లింగశరీరము మొదలుకొని బ్రహ్మాండాంతమైన సకల ప్రపంచమును సృజించెను. రెండవదియగు ఆవరణశక్తి అంధకారమువలె నావరించును. ఈ యావరణశక్తియే సంసారమునకు మూలకారణము' అనెడి శ్రుత్యుక్తముగ ఆ రెండు శక్తులలోను విక్షేపశక్తియే, శబ్దమే గుణముగాగల సూక్ష్మాకాశమయ్యెను. అనగా తమోగుణ ప్రధానమగు మూలప్రకృతిచే నావరింపబడియున్న పరబ్రహ్మము నుండి యాకాశము అనగా ఆకాశ నామరూపములు గలిగెను. అభివ్యక్తములయ్యెను. ఆ యాకాశ నామరూపములచే నావరింపపడిన బ్రహ్మమునుండి స్పర్శయే గుణముగాగలవాయువును, వాయువుచే నావరింపబడిన చైతన్యమునుండి రూపమే గుణముగాగల యగ్నియు, అగ్నిచే నావరింపబడిన బ్రహ్మమునుండి రసమే గుణముగాగల జలమును, జలముచే నావరింపబడిన చైతన్యమునుండి గంధమే గుణముగాగల పృథివియు జనించెను. జనించుట యనగా నంతకు బూర్వము ప్రకాశములై యున్న నామ

రూపము లభివ్యక్తములగుటయే. ఈ యర్థము, ''తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ॥'' (తై. ఉ. 2-1) అనెడి శ్రుతివచనమువలన విశదమగును. ఈ పంచ భూతములకు సూక్ష్మభూతములు, అపంచీకృత ములు, తన్మాత్రలు నని నామాంతరములు. ఈ పంచభూతములకును సత్త్వరజస్తమోగుణ ములు కారణమగు అజ్ఞానమువలన నాగతము లైయున్నవి. ఈ పంచసూక్ష్మ భూతముల యొక్క ప్రత్యేకసత్త్వ గుణాంశమువలన, దిగ్వాతార్కవరుణాశ్వినేయ రూపాధిష్ఠాన దేవతా సమన్వితములైన శ్రోత్రత్వక్చక్షు ర్జిహ్వాఘ్రాణము లనియెడి జ్ఞానేంద్రియము లైదును క్రమముగ జనించినవి. ఈ పంచ సూక్ష్మ భూతములయొక్క సత్త్వగుణ సమష్టి చేత అంతఃకరణము జనించెను. అది చంద్ర వాచస్పతి రుద్రక్షేత్రజ్ఞ రూపాధిష్ఠాన దేవతా యుక్తమైన మనోబుద్ధ్యహంకార చిత్తము లని, సంశయ-నిశ్చయ-అభిమాన-ధారణ లని యెడి వృత్తిభేదముచేత చతుర్విధములు. వానిలో మనస్సునందు చిత్తమునకును, బుద్ధి యందహంకారమునకును అంతర్భావము. ఇట్లే ఆకాశాది పంచసూక్ష్మ భూతములయొక్క ప్రత్యేక రజోగుణాంశమువలన వహ్నీంద్రో పేంద్ర మృత్యు ప్రజాపతి రూపాధిష్ఠాన దేవతా సమేతములైన వాక్పాణి పాదపాయూపస్థలని యెడి కర్మేంద్రియము లైదును క్రమముగ జనించినవి. ఈ పంచసూక్ష్మభూతములయొక్క రజోగుణసమష్టిచేత ప్రాణము జనించెను. అది విశిష్ట విశ్వస్రష్ట విశ్వయోని అజ జయరూపాధి ష్ఠాన దేవతాఉపేతమైన ప్రాణాపానవ్యానోదాన సమానములని, ఉచ్ఛ్వాస-నిశ్శ్వాస-బలదాన-ఉద్గమన-అన్న పచనములనియెడి వృత్తిభేదము చేత నైదువిధములు. ''పంచప్రాణ మనోబుద్ధి దశేంద్రియ సమన్వితం। అపంచీకృత భూతోత్థం సూక్ష్మాంగం భోగసాధనం॥'' (ఆత్మబోధ.) అపంచీకృత పంచసూక్ష్మ భూతోత్పన్నములైన యీ జ్ఞానేంద్రియ పంచకము, కర్మేంద్రియ పంచకము, ప్రాణపంచకము, మనోబుద్ధులును, ఏకీభవించి సప్తదశ సూక్ష్మావయవాత్మకమైనది సూక్ష్మశరీరము. దీనికే లింగశరీరమని సంజ్ఞ. ఇదియె కర్మఫలోపలంభము (అనుభవము) నకు సాధనము. ఈ సూక్ష్మశరీరమునందు జీవేశ్వ రులయొక్క అవస్థానము స్వప్నావస్థ. ఈ సూక్ష్మశరీరమునందు విజ్ఞానమయకోశము, మనోమయకోశము, ప్రాణమయకోశమును గలవు. ఇందు విజ్ఞానమయకోశము జ్ఞానశక్తి వంతియై కర్తృరూపమైనది. మనోమయకోశము ఇచ్ఛాశక్తివంతమై కరణ (సాధన) రూపమైనది. ప్రాణమయకోశము క్రియాశక్తివంతమై కార్య రూపమైనది. యోగ్యత ననుసరించి వీనియొక్క విభాగము వివరింపబడినది. పూర్వోక్త కారణ మునకును, ఈ సూక్ష్మసృష్టి కలుగుటకును ఆ జీవుల పూర్వకర్మములె సహాయములు. ఈ జీవత్వ మనాదికావున దేహాభిమానమువలన బూర్వకల్పమున జీవులచే నొనర్పబడి సంచి తము లైయున్న కర్మములు ఫలముల నొసగు స్థితికి రాగానే యుత్తరకల్ప మారంభమై క్రమముగ సూక్ష్మ స్థూలసృష్టులు కలుగు చుండును. ఇదియ సూక్ష్మ ప్రపంచ సృష్టి ప్రకారము.

అటుతరువాత స్థూలప్రపంచ సృష్టి ప్రకా రము చెప్పబడుచున్నది. ''స్రష్టుకామో జగ ద్యోనిస్తమోగుణ మధిష్ఠాయ సూక్ష్మతన్మా త్రాణి భూతాని స్థూలీకర్తుం సోఽకామయతః

సృష్టేః పరిమితాని భూతాన్యేకమేకం ద్విధా విధాయ పునశ్చతుర్ధాకృత్వాస్వ స్వేతరద్వితీయాంశై పంచపంచధాసంయోజ్య పంచీకృత భూతైః అనంతకోటి బ్రహ్మాండాని, తత్తదండోచితచతుర్దశ భువనాని, తత్తద్భువనోచిత గోళక స్థూలశరీరాణి అసృజత్॥'' (పైంగల. ఉ. 1.) జగత్సృష్టిని జేయ సంకల్పించి యారంభించిన సర్వజగత్కారణుడైన ఈశ్వరుడు నిజాశ్రిత స్వాధీన మూలప్రకృతియందలి తమోగుణము నంగీకరించి సూక్ష్మతన్మాత్రములైన పంచభూతములను స్థూలములుగ జేయ సంకల్పించెను. సృష్టిమూలమున పరిచ్ఛిన్నమైయున్న(పరిమితములైయున్న)పంచసూక్ష్మభూతములను ఒక్కొక్క భూతమును రెండుభాగములుగ విభజించి, మఱల నందొక్కొక్క భూతార్థభాగమును నాలుగు సమభాగములుగ విభజించి యొక్కొక్క నాలుగు పరకభాగములను స్వార్థభాగమునువిడిచి యితర భూతార్థ భాగములతో గూర్చిన, ప్రతిభూతమునందును సగభాగము అసలు భూతమును మిగత సగభాగము ఇతర నాలుగు భూతములయొక్క నాలుగు అష్టమాంశములును ఏకీభవించి, మొదటి సూక్ష్మభూతములైదును పంచీకృతములై స్థూలభూతములగుచు స్థూలాకృతులను బొందుటవలన నింద్రియ గోచరములగును. ఇటుల పంచీకృతములైన పంచమహాస్థూల భూతములచేత అనంతకోటి బ్రహ్మాండములను ఆ బ్రహ్మాండముల కనుగుణమైన (తగిన) చతుర్దశ భువనములను, ఆయాభువనముల కుచితములైన చతుర్విధ స్థూల శరీర సమూహములను, వానికి యోగ్యమైన భోగ్యవస్తుజాతమును సృజించెను. సృజించుట యనగా నామరూపములను ప్రకాశింపజేయుట యనియే యర్థము కాని ఈశ్వరునికంటె వేఱుగ నొక్కదానిని గల్పించుటయని యర్థముకాదు. మఱియు పూర్వోక్త సూక్ష్మభూతములయొక్క పంచీకృతత్వమే స్థూలభూతత్వముకాని తద్వ్యతిరిక్తముగ స్థూలభూతోత్పత్తి యిచట వివక్షితము కాదని గ్రహించవలయును'' అనెడి శ్రుత్యుక్తప్రకారము ''ద్విధావిధాయచైకైకం చతుర్ధాప్రథమంపునః । స్వస్వేతరద్వితీయాంశైర్యోజనాత్పంచపంచతే॥'' (పంచదశి. 1-7) ''అథతమోగుణప్రధానా న్యపంచీకృతాని న్యాకాశాదీనిపంచాపిభూతాని ప్రత్యేకం ద్వేధా విభజ్యతత్రైకైకమర్థం చతుర్ధావిభజ్య స్వార్థభాగం విహాయేతర భూతార్థభాగేషు సంయోజనం పంచీకరణం॥'' అటుతరువాత తమోగుణ ప్రధానములైన అపంచీకృత ఆకాశాది సూక్ష్మ భూతములైదింటిని ప్రత్యేకముగ నొక్కొక్క దానిని రెండు సమరాసులుగ విభజించి అందలి ప్రతి భూతార్థభాగమునువిడిచి ప్రతి భూతముయొక్క రెండవ అర్థభాగమును మఱల నాలుగు సమభాగములుగ విభజించి, దానంగలిగిన ఒక్కొక్కటి పరకచొప్పున నాలుగు పరకభాగములను స్వార్థభాగమును విడిచి ఇతర నాలుగు భూతార్థ భాగములయందు సంయోజనమొనర్చుటయే పంచీకరణము. దీనికిని జీవులయొక్క పూర్వజన్మములయందు వారిచేతం జేయబడి ప్రస్తుత జన్మమున అనుభవసిద్ధములుగ పరిపక్వములైయున్న సంచితకర్మములు ఫలోన్ముఖములగుటయే కారణము. ఈప్రకారము జీవులయొక్క ప్రాక్తన జన్మమున అనుభవమునకు ఆరబ్ధములైన పూర్వకర్మముల సహాయమునగూర్చిన పంచీకరణ క్రమమువలన శబ్దగుణముగల ఆకాశము, శబ్దస్పర్శగుణములుగల వాయువు, శబ్దస్పర్శరూప గుణములుగల అగ్ని, శబ్దస్పర్శ

రూపరస గుణములుగల జలము, శబ్దస్పర్శ
రూపరసగంధ గుణములుగల పృథివియును
పంచీకృతములై మహాస్థూలాకృతులైన
వగుచు ప్రకటములై ఇంద్రియగోచరము
లయ్యెను. ఈ పంచీకృత పంచమహాభూతముల
వలన బ్రహ్మాండము అందులో భూలోకము-
భువర్లోకము-సువర్లోకము- మహర్లోకము - జన
లోకము-తపోలోకము-సత్యలోకము నను సప్త
ఊర్ధ్వలోకములును; అతలము - వితలము-సుత
లము-రసాతలము-తలాతలము - మహాతలము-
పాతాళము నను సప్త అధోలోకములును కలిసి
చతుర్దశ భువనములును; ఆయా భువనముల
యందు తత్తదుచితములైన జరాయుజాండ
జస్వేదజోద్భిజ్జరూపములైన చతుర్విధ స్థూల
శరీర సమూహములును, జరాయుజములనగా
మావివలన బుట్టునట్టి మనుష్య పశ్వాదులును-
అండజములనగా గ్రుడ్డువలనబుట్టునట్టి పక్షి
పన్నగాదులును-స్వేదజములనగా ఉక్కవలన
బుట్టునట్టి మశకమత్కుణాదులును - ఉద్భిజ్జము
లనగా భూమిని బ్రక్కలించి భూమినుండి పుట్టు
నట్టి కక్షవృక్షాదులును; వాని కనుగుణమైన
ధాన్యములు ఓషధులు మున్నగు భోగ్యపదార్థ
జాతమును పుట్టినవి. ఈ స్థూలశరీరమునందు
జీవేశ్వరులయొక్క అవస్థానము జాగ్రదవస్థ.
ఈ స్థూలశరీరము త్వఙ్మాంసరుధిరమేదోమ
జ్జాస్థులనెడి షట్కోశాత్మకమైన అన్నమయ
కోశము, అన్నమువలన నుత్పన్నమై, అన్నము
చేతనే వర్థిల్లుచు అన్నవికారమైన కారణము
వలన స్థూలశరీరము అన్నమయకోశ మన
బడును. "పంచీకృత మహాభూత సంభవం కర్మ
సంచితం । శరీరం సుఖదుఃఖానాం భోగాయతన
ముచ్యతే॥" (ఆత్మబోధ.) బహుజన్మార్జిత
సంచితకర్మమునుండి పరిపక్వమై అనుభవారబ్ధ
మగు కర్మసహితమైన పంచీకృత పంచమహా
భూత సముద్భూతమైన ఈ స్థూలశరీరమే—
అన్నమయకోశమే-కర్మఫల భూతములైన సుఖ
దుఃఖముల యనుభవమునకు ముఖ్యనిలయము.
ఇది స్థూలసృష్టిప్రకారము.

ఈ కారణ శరీరము-సూక్ష్మశరీరము-స్థూల
శరీరమును ప్రత్యేకము వ్యష్టిసమష్టి భేదము
చేత రెండువిధములు. 'ఒక వృక్షము'-'ఒక
గృహము' వ్యష్టి, అనేక వృక్షసముదాయము
గల 'వనము'-అనేక గృహసముదాయమునుగల
'గ్రామము' సమష్టి. ఇట్లే 'ఒక శరీరము'
వ్యష్టి-సకలశరీర సముదాయముగల ప్రపంచము
సమష్టి. అందు సమష్ట్యుపాధికుడైన పర
బ్రహ్మము ఈశ్వరుడు. వ్యష్ట్యుపాధికుడైన పర
బ్రహ్మము జీవుడు. అందునను, కారణ సమష్టి
చేత ఈశ్వరుడు-కారణ వ్యష్టిచేత ప్రాజ్ఞుడు
అనియు; సూక్ష్మసమష్టిచేత హిరణ్యగర్భుడు-
సూక్ష్మవ్యష్టిచేత తైజసుడుఅనియు; స్థూలసమష్టి
చేత వైశ్వానరుడు-స్థూలవ్యష్టిచేతవిశ్వుడు అని
యు నిట్లుజీవేశ్వరులయందు అవాంతర భేదము.

"ఉత్పన్నస్య జగద్యోని రగుణోఽపి రజో
గుణం । భుంజన్ప్రవర్తతేసర్గే బ్రహ్మత్వం సము
పాశ్రితః । బ్రహ్మత్వేన ప్రజాసృష్ట్వా తత
స్సత్త్వాతిరేకవాన్ । విష్ణుత్వమేత్యధర్మేణ
కురుతే పరిపాలనం । తతస్తమో గుణోద్రిక్తో
రుద్రత్వేచాఖిలంజగత్ । ఉపసంహృత్యవై శేతే
త్రైలోక్య త్రిగుణోఽగుణః॥" (మా. పు. 46.
అ.) విశేషముగ నుత్పన్నమైన అశేష ప్రపంచ
మునకు గారణభూతుడైన పరబ్రహ్మము నిర్గు
ణియేమైనను స్వాశ్రిత స్వాధీన మాయా సంబం
ధము వలన, రజోగుణము నవలంబించి సృష్టి
కార్యమునందు బ్రహ్మత్వమునుపొంది లోకా
దులను సృజించుచు అంతట సత్త్వగుణ ప్రధా

నుడై స్థితికార్యమునందు విష్ణుత్వమునుపొంది ధర్మముగ జగత్పరిపాలనమును జేయుచున్నాడు. అంతట తమోగుణాతిశయుడై లయకార్యము నందు రుద్రత్వమునుపొంది యఖిల ప్రపంచము నుపసంహరించి ముల్లోకములను స్వప్నతుల్య ప్రపంచములుగ జేయుచున్నాడు. ఇట్లు పరబ్రహ్మము సగుణుడయ్యును నిర్గుణుడేయని మార్కండేయ పురాణోక్తప్రకారము ఈ యీశ్వరుడే రజోగుణమనెడి యుపాధిచేత బ్రహ్మాభిధానుడై జగత్సృష్టిని, సత్త్వగుణమనెడి యుపాధిచేత విష్ణునామధేయుడై జగత్పరిపాలనమును తమోగుణమనెడి యుపాధిచేత రుద్రాభిఖ్యుడై జగత్ప్రలయమును చేయుచున్నాడు. బ్రహ్మకు విరాట్పురుషునియందంతర్భావము. విష్ణువునకు హిరణ్యగర్భునియందంతర్భావము. రుద్రునకు ఈశ్వరునియందంతర్భావము. ఇదియే ప్రపంచోత్పత్తి, ఇదియే అధ్యారోపము, ఇది విక్షేపశక్తి కార్యము.

అటుతరువాత ఆవరణశక్తి కార్యము చెప్పబడుచున్నది.—''మాయాంతు ప్రకృతిం విద్యాన్మాయినంతు మహేశ్వరం । తస్యావయవభూతైస్తు వ్యాప్తం సర్వమిదంజగత్॥'' (శ్వే. ఉ. 4-10). మాయనే ప్రకృతినిగా దెలియవలయును. ప్రకృతియనగా ''ప్రకర్షేణక్రియతే బ్రహ్మణ సకాశాత్ జగదారంభోనయేతి ప్రకృతిః॥'' బ్రహ్మప్రతిబింబము (చిచ్ఛక్తి)తో గూడి గుణసామ్యావస్థగలదియై విశేషముగ జగత్సృష్టిని జేయు మాయయే ప్రకృతి. ''ఆ మాయకు అధిష్ఠాత మహేశ్వరుడు. అనగా మాయ మహేశ్వరునకు స్వాధీనమైయుండును. చిచ్ఛాయా సమేతమగు మాయయొక్క అంగభూతమైన కారణకార్య సముదాయముచేత నీ ప్రపంచమంతయు సంపూర్ణముగ వ్యాప్తమైయున్నది. ''అస్మాన్మాయీసృజతే విశ్వమేతత్తస్మింశ్చాన్యో మాయయా సన్నిరుద్ధః॥'' (శ్వే ఉ. 4-9). ఈ సకల కారణ కార్యరూప మాయకు అధిష్ఠానమును అధిపతియునైన పరమేశ్వరుడే ఆత్మాంశభూతమగు నీ సకల ప్రపంచమును పూర్వోక్త పంచభూతాది తత్త్వ సముదాయమువలన కల్పించుచున్నాడు. ఇట్లు కల్పితమైన ఆ జగత్తునందు, బ్రహ్మవిదుని కంటె భిన్నమైన సమస్త జీవ సముదాయము మాయా మూలమున బంధింపబడుచున్నది. అనగా జీవుడు మాయకు వశుడై యుండును'' అను నిత్యాదిశ్రుతులు మానముగ ఈశ్వరునకు మాయవలన నుపద్రవమేమియు లేదు. ఆ యీశ్వరునకును లోకములో ఆత్మవిజ్ఞానికిని భేదము లేదు. అందువలన ఈశ్వరుని, ఆత్మవిజ్ఞానిని, ఆవరణశక్తి, యావరింపజాలకుండుటచేత వారిని మాత్రము విడిచి యితర జీవుల కందఱకును, పంచకోశములకును ఆత్మకు గల భేదమును అంధకారమువలె నావరించుచున్నది. దానభ్రాంతి (విరుద్ధజ్ఞానము) కలుగుచున్నది. అనగారజ్జువునందుసర్పభ్రాంతివలెఅవ్యయమైకనిత్యశుద్ధముక్తాత్మయందుసంసారపరిచ్ఛిన్నజీవభ్రాంతి కలుగుచున్నది. ఈ యావరణము, 1 అసత్త్వావరణము. 2 అభానావరణము నని రెండు విధములు, 'వస్తునాస్తి'=బ్రహ్మము లేదు' అనెడి వ్యవహార కారణము అసత్త్వావరణము. 'వస్తునభాతి=బ్రహ్మము ప్రకాశించుటలేదు' అనెడి వ్యవహార కారణము అభానావరణము. ఆవరణశక్తి కార్యమే సంసార వృక్షమునకు మూలము కాని విక్షేపశక్తి కార్యము సంసార వృక్షమునకు మూలముకాదు. ఈ వివేకమే మోక్షసిద్ధికి హేతువు. ఈ రెండువిధములైన ఆవరణములుకూడతత్త్వజ్ఞానముచేతబాధ్యములు.

ప్రశ్నోత్తరి

(శ్రీ ఆది శంకరులవారి సంస్కృత గ్రంథమున కాంధ్రీకరణము)

శ్రీ గుమ్మలూరి లక్ష్మీనృసింహ శర్మ

పారమే లేనియట్టి సం♦సారజలధి, జిక్కువడియున్న నాకేది ♦ దిక్కు, దయను
హే కృపాలో!, గురూ! సెల♦వీయు డింక, జగదధీశ్వరు గొప్పదౌ ♦ చరణనౌక॥ ౧

బంధనంబెద్ది? విషయాను♦వర్తనంబు, మోక్షమన నెద్ది? విషయవై♦ముఖ్యపటిమ,
స్వర్గమన నెద్ది? విగతతృ♦ష్ణా ప్రశస్తి, హేయతర నరకమెయ్యది? ♦ స్వీయతనువె॥ ౨

నరకమున కెద్ది ద్వారంబు? ♦ సరసిజాక్షి, హాయిమై నిద్రవోగల్గు ♦ నాతడెవడు?
అతుల నిష్ఠాగరిష్ఠ స♦మాధిగతుడు, ఎవరు నిజమైన శత్రువు? ♦ లింద్రియములు॥ ౩

ఎవరు నిజమైనమిత్రు? లా♦యింద్రియములె, వాని బూర్తిగను జయించి♦వైచినపుడు;
ఎవడు నిజమైన మెలకువ ♦ నెప్పుడొప్పు? భవ్యసదసద్వివేక సం♦పన్నుండు॥ ౪

ఎద్ది సంసారబాధల ♦ నెల్ల గూల్చు? వేదజనితాత్మ విజ్ఞాన ♦ విభవ మహిమ,
మోక్షహేతు వెయ్యది? యాత్మ ♦ బోధనంబు, స్వర్గమనజాలు నెది? యహిం♦సావ్రతంబు॥

ఎవ్వడు దరిద్రు? డత్యాశ ♦ నెసగువాడు, ధనికు డెవ్వాడు? సంతుష్టి ♦ దనరువాడు,
ఉండి మృతతుల్యు డెవడు? ని♦రుద్యముండు, అమృతమెది? సుఖమిచ్చు ని♦రాశయొకడ॥ ౬

యముడు ప్రాణాల హరియింప ♦ నరుగుదేర, యత్నమున జేయదగు నెద్ది ♦ ప్రాజ్ఞవరుడు?
సౌఖ్యదము, మృత్యుహరమునౌ ♦ శౌరిసేవ, మనసుచే, వాక్కుచేతను ♦ తనువుచేత॥ ౭

మాతవలె సౌఖ్యదంబెద్ది? ♦ మంచివిద్య, సభను శోభిలు నెవ్వండు? ♦ సద్బుధుండు,
అసురుడెవ్వాడు? దుర్వాస♦నాయుతుండు, ఇచ్చినకొలంది పెంపారు ♦ నెద్ది? విద్య॥ ౮

వేనికి భయంబుజెందగా ♦ నౌను జనులు? భవ వనానికి, లోకాప♦వాదమునకు;
ప్రియతరంబగు బంధువున్ ♦ బితయు నెవరు? వెతల గాపాడి-పాలించు ♦ విమలమతులు॥ ౯

రేయి బవలును గడుజింత ♦ నీయమెద్ది? సచ్చిదానంద పరతత్త్వ ♦ సత్యతయును
భవమృషత్వంబు; కర్మనా ♦ బఱగు నెద్ది? దైవమునకెద్ది ప్రీతియై ♦ తనరు నదియ॥ ౧౦

ఎవరు నిజమైన శత్రువుల్? ♦ హితులవోలె, బయటికగుపడు పుత్రాది ♦ వర్గమెల్ల;
పశువు కన్నను పశువయి ♦ పరగు నెవడు? స్వాత్మధర్మము నెఱపని ♦ శాస్త్రవిదుడు॥ ౧౧

ప్రాణములు కంఠగతములై ♦ యరుగనున్న, చేయగారాని దెది? యెద్ది♦చేయదగును?
పాపకార్యంబు నెపు డొన♦ర్పంగరాదు, శివకరంబగు పుణ్యమే ♦ చేయవలయు॥ ౧౨

దుర్లభము లెవ్వి జగతి?— స♦ద్గురువరుడును, త్యాగమున్, దైవచింత, సం♦త్సంగతియును ;
ఎవ్వనిజయింప దుష్కర ♦ మెట్టిరికిని? కనులకగుపడనట్టి యా♦కాయభవుని ॥ ౧౩

దేశికుం డెవ్వడు? హితోప♦దేశకుండు, ఛాత్రు డెవ్వడు? గురుభక్తి ♦ సంయుతుండు ;
దీర్ఘరోగి యెవ్వడు? భవో♦ద్భృతిపరుడు, దాని కౌషధ మెయ్యది? ♦ దైవచింత॥ ౧౪

వాస్తవమ్ముగ నేయది ♦ పాశమగును? మహితదారుణమమతాభి♦మాన యుగళి ;
ఈశ్వరప్రాప్తి కెయ్యవి ♦ హేతుకములు? దైవచింత, ఆనందమున్, ♦ త్యాగబుద్ధి॥ ౧౫

భూషణంబుల కెల్లను ♦ భూషణ మెది? చక్కనైనట్టి సౌశీల్య ♦ సద్విభవము ;
నిజమయిన తీర్థ మెయ్యది? ♦ నిర్మలాత్మ, శ్రావ్య మెయ్యది? గురువేద ♦ సంతవాణి॥ ౧౬

త్యాజ్యము లవెవ్వి? స్వర్ణంబు ♦ నంబుజాక్షి, అంధుడగు నాతడెవడు? కా♦మాతురుండు,
అగున దేయది మృతి? స్వకీ♦యాపయశము; ఇట్టె సమ్మోహన మొనర్చు ♦ నెద్ది? చెల్వ॥ ౧౭

సంతజను లెవ్వ? రఖిల సం♦సార సుఖవిరాగులై, మోహరహితులై ♦ బ్రహ్మతత్త్వ
మరయనిష్టాగరిష్ఠులై ♦ యలరువారు; ప్రియమయిన కార్య మెయ్యది? ♦ విష్ణుభక్తి ౧౮

ఎవడు మూర్ఖుండు? సువివేక ♦ హీనజనుడు, జ్వరమనగ నెద్ది? విషయ సం♦సక్తి నుంట,
నిజమయిన జీవనం బెద్ది? ♦ నిష్కలుషత, జ్ఞానమన నెద్ది? యేది మో♦క్షప్రద, మదె॥ ౧౯

వాస్తవిక లాభ మెద్ది? యీ♦శ్వరునిసేవ, జగతిని జయింపగల్గిన ♦ శక్తు డెవడు?
తనదగు మనస్సును జయించి ♦ తనరు నతడె; అగున దెయ్యది విద్య? అ♦ధ్యాత్మవిద్య ౨౦

వీరులందఱిలోపల ♦ వీరు డెవడు? అతను బాణంబులకు జిక్క♦నట్టివాడు ;
వీరుడును, సమదర్శియున్ ♦ విబుధు డెవడు? గరితల కటాక్షమున మోహి♦కానియతడు॥ ౨౧

మూల మెయ్యది? సంసార♦మునకు? చింత, ఏయవస్థలోనున్నప్పు ♦ డేనిగ్గాని
జ్ఞానులగువార లెవ్వాని ♦ సలుపరాదు? బంధకంబగు స్నేహమున్ ♦ పాపకర్మ॥ ౨౨

ఏరు ధన్యాత్ములు? పరోప♦కారమతులు, విషములనుమించు విష మెద్ది? ♦ విషయచయము,
దుఃఖి యెవ్వఁడు? విషయేచ్ఛ ♦ దొరలువాడు, పూజ్యు డెవ్వ డీశ్వరకృపన్ ♦బొదలునతడె॥

యత్న మొనరించి యెవిచేయ ♦ నగును బుధులు? ఉత్తమగ్రంథపఠనంబు ♦ నురుతరంపు
ధర్మపాలనమును జేయ ♦ దగును బుధులు ; త్యాజ్య మెయ్యది? విషయభో♦గానురక్తి॥ ౨౪

విమలమా వ్రత మెయ్యది? ♦ వినయగుణము, పూరుషున కెద్ది సంకెల? ♦ పూవుబోడి,
విజ్ఞులందఱిలోపల ♦ విజ్ఞు డెవడు? వంచితుడుకాని యాతడు ♦ వనిత కెపుడు॥ ౨౫

అందఱికిని దుస్త్యాజ్య మే♦యది? దురాశ, పశు వెవడు? విద్య నేమి నే♦ర్వనియతండు,
ఎఱుగగ నశక్య మేయది ♦ యెవ్వరికిని?, స్త్రీలచిత్తవృత్తియును త♦దీయ చరిత॥ ౨౬

శీఘ్రముగ ముక్తిరతుఁడెద్ది ♦ చేయవలయు? మంచిపో, త్రీశుసేవ, ని♦ర్మమతనుంట :
వాసమును, సంగమెవరితో ♦ బనికిరావు? ఖలులతో, నీచులతో, మూర్ఖ♦గణముతోడ॥ ౨౭

అగు నొకే తత్త్వమెది? పర♦మాత్మతత్త్వ, మగునెది ప్రశస్తమగుదాన? ♦ మభయదాన,
మెపు డవిశ్వసనీయమ♦దెద్ది? నారి, యే సుఖంబగుత్యాజ్యంబు? ♦ స్త్రీసుఖంబు॥ ౨౮

బధిరుఁడగు నాతఁడెవ్వాఁడు? ♦ పల్కనట్టి, హితము నెవ్వాఁడు చెవిజొఱ ♦ నీయఁడతఁడె ;
తలప మూఁగివాఁడెవ్వండు? ♦ తరుణమందు, సత్యమును నొక్కి తెల్ప న♦శక్తుఁడు॥ ౨౯

నీచతకు మూలమెయ్యది? యాచనంబు, ఘనత కెదిమూలమగును? త్యా♦గంబు చూవె
సార్థకంబయి యెవ్వాని ♦ జన్మమొప్పు? మఱల జన్మములేనట్టి ♦ మానవునిది॥ ౩౦

ఎవని మృత్యువు సార్థకం♦బవుచు దనరు? తిరుగ మృత్యువులేనట్టి ♦ దివ్యమతిది ;
అవని నత్యుత్తమంబగు ♦ నయ్యదెద్ది? విమలమగు నాచరణగల్గి♦వెలయునడత॥ ౩౧

శత్రువుల లోపలను మహా♦శత్రు లెవరు? అమృతమును, లోభమును, క్రోధ, ♦ మధికతృష్ణ
తోడ నొప్పారు కామాది ♦ దుర్గుణములు; అగు ముఖంబున కెది భూష? ♦ సాక్షరతయ॥ ౩౨

నిజమయిన కర్మమెయ్యది? ♦ నిఖిలమైన, జీవకోటికి హితమును ♦ జేయుచుంటె ;
పనుల నెవిచేసి శోకింప ♦ ననవసరము? హరిహరుల పూజనంబను♦నట్టి పనులు॥ ౩౩

హెచ్చుగా గ్రుచ్చుకొనునెద్ది ♦ యెముకవోలె, కర్కశంబగు? తనదు మూ♦ర్ఖతయెసుమ్ము ;
తెలిసికొన నింకబనిలేదు ♦ దేని దెలిసి? అధికసుఖబోధరూపక ♦ మయిన శివుని॥ ౩౪

ఎవ రుపాస్యులు? గురుదేవ ♦ వృద్ధవితతి, ఏది నశియింప ముక్తి ల♦భించు? మనము,
విషయసౌఖ్యా లవెంతగా ♦ వెలయుచున్న, కనదు తృప్తి నదెయ్యది? ♦ కామగుణము॥ ౩౫

ఎందు విశ్వాస మునుపరా♦దింతయైన? ఘోరదారుణ సంసార ♦ వారిధియెడ ;
అమృతమట్టుల వెలుపలి ♦ కగుపడుచును, నిజముగా నెద్ది గరళమై♦నెగడు?—నారి॥ ౩౬

సమయునే యవి మెఱుపట్లు ♦ క్షణికములయి? యౌవనంబును, భాగ్యంబు♦నాయువయును;
ఉత్తమంబైన దానమై ♦ యొప్పునెద్ది? పాత్రులైనట్టి వారి కీ♦బడిన యదియ॥ ౩౭

ఘనుడు సర్వేశు భగవంతు ♦ కథలనువలె, నయమ మీ మణిరత్న మా♦లాభిధాన
మైన ప్రశ్నోత్తరి బఠింప ♦ నాలకింప, శాశ్వతానంద సంపత్తి ♦ జనులు గంద్రు॥ ౩౮

ఇది రమామానినీమణీ ♦ హృదయనాథ, వరకృపాప్రాప్త కవితా ప్ర♦భావ గుమ్మ
లూరి లక్ష్మీనృసింహాఖ్య ♦ సూరి రచిత, మయిన ప్రశ్నోత్తరి కృతి స♦మాప్తమయ్యె

ప్రశ్నోత్తరి సమాప్తము.

శ్రీ వివేకానంద సంభాషణలు

(ఒక భక్తుని దినచర్యనుండి)

అనువాదకుడు : శ్రీ పిన్నింటి సుబ్బారావు

[పరబ్రహ్మ, అనేకత్వము—జీవబ్రహ్మైక్య వివేకము—సచ్చిదానంద మే యందరి యాదర్శము—అహం బ్రహ్మాఽస్మి యని నిరంతరము జపింపుము—ఆత్మానాత్మ వివేకము, త్యాగము బ్రహ్మనిష్ఠకు మార్గము—నిర్భయముగా నుండుము.]

శిష్యుడు:—స్వామిజీ! పరబ్రహ్మ యొక్కటే సత్యమైనచో, ప్రపంచమునం దీ యనేకత్వ మేలగలదు? దయ చేసి సెలవిచ్చెదరా?

స్వామిజి:—నీ వీ ప్రశ్నను, పదార్థ విజ్ఞాన శాస్త్రరీత్యా ఆలోచించుచుండుట లేదా? పదార్థవిజ్ఞానము ననుసరించి, కార్య, కారణ, విచక్షణాజ్ఞానముచే, క్రమక్రమముగా, సమస్త పదార్థములయొక్క సమష్టి తత్వమునకు జేరుకొందుము, కాని నీవు మొదటనే, ఈ సమష్టి తత్వదృష్ట్యా, ఈ సమస్తమును పరిశీలించుచో, ఈ వ్యష్టిత్వము గానబడునేమో చెప్పగలవా?

శిష్యుడు:—సత్యము, నేసి సమష్టితత్వమునందున్నచో, నేను "ఎందుచేత" అని ఎట్లు ప్రశ్నింపగలను? నేను ఈవిధముగా ప్రశ్నించుటచేత, అనేకత్వమును దర్శించుచుంటినని వేరే జెప్పనవసరములేదు.

స్వామిజి:—బాగుగానున్నది. వివిధ పదార్థములను పరిశీలించి, వస్తువులయొక్క మూలకారణమును గ్రహించుట, శాస్త్రముల వ్యతిరేకముగాతర్కించుట యనియు లేక వక్రమార్గమున వాదించుటయనియు, ననగా, మొదటలేనిదానిని ఉన్నట్టుగా భావించి, పిమ్మట తర్కజ్ఞానముచే, అది పదార్థముగా నేరదని నిరూపించుట యనియు, పిలువబడుచున్నవి. సత్యముగాని వస్తువును, సత్యమని నమ్మి, వస్తువుయొక్క మూలతత్వమును గ్రహించు పద్ధతినిగూర్చి, నీవు మాట్లాడుచుంటివిగాదా? నిజమేనా?

శిష్యుడు:—నా మనస్సునకు ఈ కనబడునదంతయు యథార్థమనియు, దీనికి వ్యతిరేకముగా నున్నదంతయు అసత్యమనియు, దోచుచున్నది.

స్వామిజి:—కాని, వేదములు "ఏక మే వా

ద్వితీయంబ్రహ్మ'' ఉన్న దొక్కటేయని వచించుచున్నవి. ఆ యున్నదొక్కటియు, పరబ్రహ్మస్వరూపమేయగుచో, నీ యనేకత్వ సిద్ధాంతము అసత్యమనవలెను. బహుశా, నీవు వేదములను నమ్మెదవని తలచెదను.

శిష్యుడు:—నామట్టునకు నాకు వేదప్రమాణమునకు మించిన గొప్ప ప్రమాణము లేదని నమ్మెదను. కాని, తర్కించునపుడు వేదప్రమాణము నంగీకరింపనివాని కితరసాధనములను జూపి, ఖండింపవలయును.

స్వామిజి:—అదిగూడ జేయవచ్చును. ఇటు చూడుము. ఒకానొక సమయమున, ఈ కనబడు సమస్తము మాయమై, ఏమియును గోచరముగాని స్థితి రాగలదు. అట్టి స్థితిని నేను జీవితములో ననుభవించితిని.

శిష్యుడు:—ఎప్పుడు తమరు ఆరీతిగా ననుభవించితిరి?

స్వామిజి:—ఒకానొకరోజున, దక్షిణేశ్వరమందలి ఆలయారామమందు శ్రీ రామకృష్ణులు నా హృదయమును స్పృశించిరి. మొట్టమొదట సమస్తమైన భవనములు, గదులు, తలుపులు, కిటికీలు, వసారాలు, చెట్లు, సూర్యుడు, చంద్రుడు అన్నియు ఎగిరిపోవుచున్నట్లును, ముక్కలుముక్కలుగా బద్దలై పోవుచున్నట్లును, అణువులుగను, పరమాణువులుగను విడిపోయి చివరకు ఆకాశమం దణగిపోయినట్లుగా గాంచితిని. క్రమముగా ఆ యాకాశముగూడ యదృశ్యమై, పిమ్మట నా యహంకారము, బాహ్యస్మృతినిగూడగోల్పోయితిని. పిమ్మట నేమి సంభవించినదో నేను జ్ఞాపకము జేసికొనజాలను. మొదట నాకు భయముగలిగినది. ఆ స్థితినుండి బాహ్యస్మృతికి వచ్చినతోడనే, యీ గృహములు, తలుపులు, కిటికీలు, వసారాలు, సమస్తమును గాన్పించినవి. ఇంకొక సమయమున, అమెరికా ఖండమున ఒకానొక సరోవరముచెంత నిట్టిదే మఱియొకసారి కాంచితిని.

శిష్యుడు:—మనస్సునకు వెఱ్ఱి ఎత్తినపు డిట్టి స్థితి సంభవింపగూడదా? ఒకవేళ ఇట్టి స్థితి గలిగినను, అనుభవించు మహాసౌఖ్యమేదియో నాకు అర్థమగుటలేదు.

స్వామిజి:—మనస్సునకు పిచ్చియెత్తుటా! ఏ రోగమైనను సంధించుటవలనగాని, ఏ మద్యమునైనను సేవించుటవలనగాని, అస్వాభావికమగు శ్వాసనియమ సాధనలచే గలుగు భ్రమవలనగాని, ఏర్పడక, పరిపూర్ణారోగ్యవంతునకు గలిగిన యీ స్థితి పిచ్చితనమని ఎట్లు చెప్పగలవు? వేదములలో చెప్పబడిన స్థితితో, ఈ స్థితి తులతూగుచున్నది. పూర్వకాలపు మతాచార్యుల, ఋషుల వాక్యములతో ఈ స్థితి సమన్వయమగుచున్నది. (చిరునవ్వుతో) చివరకు నన్ను పిచ్చివానిగా భావించుచుంటివా?

శిష్యుడు:—కాదు, కాదు. ఆవిధముగా నేను తలచుటలేదు. శాస్త్రములయందు పూర్ణస్థితిని ప్రాపించిన యుదాహరణములు వందలకొలది నుదహరింపబడియుండగను, కరతలామలకమువలె, ప్రతి మానవుడును, ఈ స్థితిని ప్రత్యక్షముగా ననుభవింపవచ్చునని తమరు సెలవిచ్చుచుండుటచేతను, వేదశాస్త్రములయందు నుడివియున్నరీతిగా, తమ జీవితమునం దీ విషయమున ననుభవ

మును పొందుటచేతను, నేను ఇది యసత్యమని చెప్పుట కెట్లు సాహసింతును? శ్రీ శంకరాచార్యులవారుగూడ ఇట్టిస్థితిని అనుభవించి, "ఈ ప్రపంచమేది" మొదలగు అనుభవ వాక్యములను నుడివిరి.

స్వామిజి:—ఈ వ్యష్టియందలి సమష్టిని గ్రహించుటయే పరబ్రహ్మమును గుర్తించుట యనియు, దీనిని గ్రహించిన పిరికితనము జననమరణములు పూర్తిగా నశించిపోవుననియు, సమస్త శాస్త్రములును నుడువుచున్నవి. జీవితమునం దొక్కసారియైనను ఆ బ్రహ్మానందరసమును గ్రోలినచో, ప్రపంచమందలి సుఖదుఃఖములచే క్రుంగిపోనేరదు. మానవులు నిష్ప్రయోజనములగు కామినీ కాంచనములచే బంధింపబడి, ఈ బ్రహ్మానందమును అనుభవింపనేరరు.

శిష్యుడు:—ఇది నిజమైనచో, మనము యథార్థముగా ఆ పరిపూర్ణుని యంశములమే యైనచో, స్వాభావికముగా మనమేల ఆ బ్రహ్మానందమును బడయుటకు యత్నింపకున్నాము? కామినీ కాంచనములను నిరర్థక జాలకమునందుజిక్కి, మోసగింపబడి మృత్యుగహ్వరమును మరల మరలజొచ్చుటకు కారణమేమి?

స్వామిజి:—మానవులీ సచ్చిదానందమును వాంఛించుటలేదను భావముతో నీవు మాట్లాడుచున్నావు. జాగ్రత్తగా ఆలోచింపుము. మనము జేయు ప్రతి కార్యమును, ఆ బ్రహ్మానందమును గ్రోలుటకొరకే. కాని, ఎవ్వరును దానిని గుర్తించుచుండుటలేదు. అందుచేత దానిని గ్రహించుటయునులేదు. బ్రహ్మము మొదలు తృణపర్యంతమునుగల సమస్తమునందును, ఈ సచ్చిదానంద మంతర్గతమైయున్నది. నీవుగూడ ఆ పరిపూర్ణ బ్రహ్మస్వరూపమవే. నీవా పరిపూర్ణ స్వరూపమ వని నిశ్చయముగా దలచిన, ఈ క్షణమునందే, యా పూర్ణస్థితి సిద్ధింపగలదు. ప్రత్యక్ష సాక్షాత్కారము విధిగా గావలయును. నీవు నీ భార్యకై యింత సేవచేయుటగూడ ఆ సచ్చిదానంద రసాస్వాదనమునకే. అనేకసార్లు భ్రాంతియందు దగుల్కొని, శోక, మోహములచే గొట్టువడి, మానవుడు స్వభావ సిద్ధముగా తన సహజాంతరంగిక స్వరూపముపై దృష్టిని సారించును. ఈ సచ్చిదానందరసము నాస్వాదించు ఈప్సితము హృదయమునం దుండుటయే బహువిధములగు కష్టపరంపరల ననుభవించి, మానవుడు తన యంతరంగ స్వరూపముపై దృష్టిని కేంద్రీకరించుటకు గారణము. ప్రతి మానవుడును, ఎట్టి మినహాయింపునులేక, ఈరీతిగా జేయగలడు. కొందరకీ జన్మతోడనే సిద్ధించును. మరికొందరకు పెక్కు జన్మల యనంతరము ప్రాప్తించును.

శిష్యుడు:—ఇదంతయును భగవంతుని కృపావిశేషము మీదను, గురువుయొక్క యాశీర్వచనాబలము మీదను ఆధారపడియుండును.

స్వామిజి:—భగవంతుని కృపయనెడి మారుతమనాదినుండియు వీచుచునేయున్నది. నీవు నీ తెరచాపను తెరచితివా? నీ వేపనిని ఒనర్చుచున్నను, నిశ్చలమానసముతో, హృదయపూర్వకముగా నొనర్పుము. అహోరాత్రములు "నేనా సచ్చిదానంద

స్వరూపమను. నాకు భయము, ఆదుర్దా ఎందుకు? ఈ శరీరము, మనస్సు, బుద్ధియు అశాశ్వతములు. ఈ మూడింటికి నతీతమగు వస్తువేదిగలదో యదియే 'నేను'' అని నిరంతరము స్మరింపుము.

శిష్యుడు:—అప్పుడప్పుడు బహు స్వల్పకాలము మాత్రమే యిట్టి భావములు గలుగుచుండును. కాని వెనువెంటనే యవి యదృశ్యమై, నిరర్థకములు నిష్ప్రయోజనములు నగు సమస్త భావములు పునరుద్ధానమగుచుండును.

స్వామిజి:—ఆరంభ దశయందే యీరీతిగా నుండును. కాని క్రమక్రమముగా వీనిని నిగ్రహింపవచ్చును. కాని మొదటినుంచియు, మనస్సునందు తీవ్రమగు సంకల్పమవసరమైయున్నది. ఎల్లప్పుడును ''నేను నిర్మలుడను, జ్ఞానస్వరూపుడను, నిష్క్రియుడను, ముక్తపురుషుడను. దుశ్చేష్టితముల నెట్లుజేయగలను? నిరర్థకములగు కామినీ, కాంచనములను మాయలోబడు సామాన్య మానవునివలె, వెఱ్ఱివానినిగా నగుదునను కొంటివా?'' ఇట్టి భావములతో మనస్సునకు బలము జేకూర్చుకొనుము. ఇది తప్పక యథార్థమగు మంచిని కలుగజేయగలదు.

శిష్యుడు:—ఒకానొక సమయమున మనస్సునకు బలము చేకూరగలదు. అంతట నేను, డెప్యూటీ మేజస్ట్రేటు పరీక్షకు హాజరయ్యెదనని తలచినంతనే నా హృదయములో, ధనము, పేరు, ప్రతిష్ట సంపాదించవలయుననెడి కుతూహలము, సౌఖ్యముగను, బాగుగను జీవించవలయుననెడి కుతూహలము రేకెత్తగలవు.

స్వామిజి:—ఇట్టి భావములు, మనమునందుద్భవించినతోడనే, నీలోనీవు, ఆత్మానాత వివేకమును, విచక్షణజేయుము. వేదాంతమును నీవు పఠించలేదా? నీ సుషుప్త్యవస్థయందుగూడ, నీ శిరోభాగమున, ఆత్మానాత్మవివేకమను కరవాలము నుంచుకొనిన, స్వప్నమందుగూడ ఆశాపిశాచము దరిజేరజాలదు. ఈవిధముగా ఆత్మబలము నభ్యసించుచో, క్రమక్రమముగా, త్యాగధర్మము సిద్ధించి, నీకొరకై స్వర్గద్వారములు తెరచియుండుట నీవు గమనింపగలవు.

శిష్యుడు—అట్లైనచో, స్వామిజీ, భక్తిగ్రంథములయందు, తీవ్రవైరాగ్యము, హృదయమునందలి మార్దవమును నశింపజేయునని ఏల జెప్పుచున్నవి?

స్వామిజి:—ఆవిధముగా నుడువు గ్రంథములను బహిష్కరించవలసినదిగా నేను జెప్పుచున్నాను. వైరాగ్యము లేనిచో, విషయేంద్రియములయందు తీవ్రమగు తృష్ణా రాహిత్యము లేనిచో, కామినీ కాంచనములను అసహ్యాకరములగు ముఱికి పదార్థములవలె భావింపనిచో, ''ననిధ్యతి బ్రహ్మసతాన్తరేపి'' వందలకొలది బ్రహ్మకల్పములకైనను ఎవ్వరును మోక్షమును బొందజాలరు. భగవంతుని నామజపము, ధ్యానము, ఆరాధన, అగ్నిహోత్రమును జేయుట, వైరాగ్యోదయము కొరకే. ఎవనియందు వైరాగ్యము శూన్యమో, వాని యత్నమంతయును లంగరువేసిన నావను తెడ్డువేయువానివలె నుండును, ''నప్రజయా, నధనేన, త్యాగేనైకే అమృతత్వమానసు'' ''సంతానమును బడయుటవలన

గాని, ధనమువలనగాని, కాక కేవలము వైరాగ్యము వలననే కొందరు అమృతత్వమును బొందిరి.''

శిష్యుడు:—కామినీ కాంచనములను త్యజించినంతమాత్రమున సర్వము సిద్ధించునా?

స్వామిజి:—ఈ రెంటిని త్యజించిన పిమ్మట, పేరు, ప్రతిష్ఠలు మొదలగు ఆటంకములను గూడ త్యజించవలసియుండును. అసాధారణ బలము లేనిచో, బహుకొద్దిమంది మాత్రమే వీనియందు సమత్వబుద్ధి నుంచగలరు. ప్రజలు వారిపై గౌరవములను కురిపింతురు. రకరకములగు భోగములు, క్రమక్రమముగా వారి దాపుజేరును. వీటివలననే త్యాగులలో ముప్పాతికమంది భ్రష్టులగుచున్నారు. ఈ మఠమును స్థాపించుటకును, ఇంకను మఱికొన్ని పనుల నొనర్చుటకును, తిరిగి నేను జన్మించవలసి యుండునేమో యది ఎవరు చెప్పగలరు?

శిష్యుడు:—మీరే యీవిధముగా జెప్పుచో నిక మేము ఏమి చేయగలము!

స్వామిజి:—ఎందుకు భయము? ''అభీరభీరభీః'' ''నిర్భయముగా నుండుము, నిర్భయముగా నుండుము, నిర్భయముగా నుండుము.'' నీవు నాగమహాశయుని జూచితివిగదా. గృహస్థుడైనను, ఆతడు సన్న్యాసులకంటె ఎంత ఘనుడో చూచితివా!'' ఇది యసాధారణము. ఆతనివలె నింకొకని నే జూచియుండలేదు. ఎవ్వరైనను గృహస్థులుగా నుండదలచినచో, నాగమహాశయునివలె నుండుటకు యత్నింపుడు. ఆతడు తూర్పు బెంగాలులోని ఆధ్యాత్మికాకాశమున నొక గొప్ప తేజోరూపముగా ప్రకాశించుచున్నాడు. ఆ ప్రాంతమందలి ప్రజలను, తరచు ఆతనిని దర్శించుటకు బోవునట్లు ప్రోత్సహింపుము. దానివలన లాభము గలదు.

శిష్యుడు:—భూలోకమున శ్రీ రామకృష్ణ భగవానుని యవతారమను నాటకమున, నాగమహాశయులు, మూర్తీభవించిన వినయమువలె గన్పట్టుచున్నారు.

స్వామిజి:—యథార్థము. సందేహమించుకంతయును లేదు. నేనొకసారిబోయి యాతనిని దర్శింపవలెనని తలంచుచున్నాను. నీవు నాతో వచ్చెదవా? వర్షాకాలములో నీటియందు మునిగిన పొలములను జూచుట నాకిష్టము. నీవు వానికి వ్రాయుదువా?

శిష్యుడు: తప్పకుండ వ్రాయుదును. తమ విషయమును వినినపుడెల్ల ఆనందముతో నొడలు మరచును. తమ పాదధూళిచే, తూర్పు బెంగాలంతయును యాత్రాస్థలమగునని యాతడు నుడువును.

స్వామిజి:- -శ్రీ రామకృష్ణుడు నాగమహాశయునిగూర్చి ''యాతడు మండుచున్న నిప్పువంటి'' వాడని చెప్పుచుండుట నీకు దెలియునా?

శిష్యుడు:—అవును, ఆవిధముగా వినియుంటిని.

స్వామిజీకోరికపై నా శిష్యుడు కొంత ప్రసాదమును స్వీకరించి, యా ఈశ్వరప్రేరితుడగు గురువుచే బోధింపబడి, ''నేను స్వతంత్రుడను, నేను స్వతంత్రుడను'' అను ధైర్యసందేశమును గూర్చి తీవ్రముగా నాలోచించుచు చీకటి పడుచుండగా, కలకత్తా చేరుకొనెను.

గ్రంథసమీక్ష

శ్రీ బుద్ధచర్య

అనువాదకులు: బ్రహ్మశ్రీ రామకృష్ణ బ్రహ్మచారి గారు, శ్రీ భూమానందాశ్రమము, గండిక్షేత్రము. ప్రకాశకులు: శ్రీ వ్యాసాశ్రమము, ఏర్పేడు, పుటలు 547. వెల: రూ. 3-0-0.

కపిలవస్తుపురాధీశుడైన శుద్ధోదనుని పుత్రరత్నము సిద్ధార్థుడు, తల్లి మాయాదేవి. సకలరాజభోగములను అనుభవించుచు సౌందర్యరాశి భార్యయగు యశోధరతో మహాభోగముల నోలలాడుచుండెను. ఇట్లయ్యు సర్వసంగ పరిత్యాగియై పరువంపు ప్రాయముననే పరివ్రాజకుడై జ్ఞానముకొరకు అడవులకుపోయి తపస్సుచేయ నారంభించెను. తుదకు గయలో నొక రావిచెట్టుక్రింద జ్ఞానోదయమును పొంది సిద్ధార్థుడు బుద్ధభగవాను డను పేరుబడసెను. దశావతారములలో నొకటిగా పరిగణింతురు బుద్ధావతారమును. ప్రజలు వేదమార్గములను విడిచి నీతిదూరులై జీవహింస కలవాటుపడిరి. ఇది చూచి సహింపలేక అహింసను బోధించుటకై బుద్ధుడవతారపురుషుడుగ జన్మించెను. ఈ మహాపురుషుడే బౌద్ధమతకర్త. ఈ విషయ మందరకు విదితమే.

భారతభూమియందేకాక బర్మా, చైనా, జపాను, సయామ్ మొదలగు దేశములందు బౌద్ధము బహుళ ప్రచారమున గలదు. మొదట బుద్ధుడు బోధించిన మతము ఒక్కటియే యైనను పలువురు విద్వాంసులు అభిప్రాయభేదములతో మాధ్యమిక, యోగాచార, సౌంత్రాంతిక, వైభాషికము లను నాలుగు విధములుగా విభజించిరి. టిబెట్టు మొదలగు పాశ్చాత్య బౌద్ధులకు దేవుడు కలడు. మిగిలిన బౌద్ధులు పాశ్చమాత్యులవలె గాక శాక్యమునినే పూజించుచున్నారు. వీరి విధానమున పంచభూత తత్త్వములు, పంచకర్మేంద్రియ తత్త్వములు మొదలగునవి ఇరువదిమూడు తత్త్వములు చెప్పబడినవి. ఈ తత్త్వములయందు ప్రధానమైనది బుద్ధితత్త్వము. బుద్ధికన్న వేరైన ఆత్మ లేదని వీరు చెప్పుదురు. బుద్ధి జ్ఞానము ఒకటి. శరీరము భౌతికము - జగత్తంతయు క్షణికము. సృష్టిలో ప్రతివస్తువు ప్రతిక్షణము వృద్ధి పొందుటో, క్షీణించుటో, పటుత్వము చెడుటో, ఎండుటో మొదలగు మార్పులను పొంది చివరకు నశించి వేరుగతిగా ఉత్పన్నమగుచున్నది. ఈ విధానమే భావనాచతుష్టయము—క్షణిక భావన, దుఃఖభావన, స్వలక్షణభావన, శూన్యభావన. ఈ నాలుగును క్షణిక ధర్మములు. జగత్తంతయు క్షణికము. జీవించుట దుఃఖ భాజకము. సంపూర్ణ సమానలక్షణములు గల రెండు వస్తువులు అసంభవములు. జగత్తు సర్వము శూన్యము. జన్మమెత్తి మనుష్యులు పుట్టుట, గిట్టుట— మొదలగునవి చెట్లు చేమలవలె ప్రకృతికార్యములు. జన్మము ముఖ్యముగా అజ్ఞానజనకము—దుఃఖమునకు మూలము జన్మవాంఛ. జ్ఞానోదయమునకు సూచన జన్మవాంఛా విరాగతయే. జన్మ బంధవిమోచనసాధన సన్న్యాస స్వీకరణ. బౌద్ధులయందు సన్న్యాసమునకు ప్రతివారును అర్హులే. వీరిమతగ్రంథములలోముఖ్యమైనది త్రిపిటకము. ఇది మూడు భాగములు గలది. సుత్తపిటకము, వినయ పిటకము, అభిదమ్మ పిటకము. బుద్ధుని బోధలు, ఉక్తులు కలది సుత్తపిటకము బౌద్ధ భిక్షువుల ధర్మము నిరూపింపబడినది వినయపిటకము. జీవితరహస్యము లెన్నియో వివరింపబడినవి అభిదమ్మపిటకమున. ఇది కాక (త్రిపిటకసారము) దమ్మపదమనియు, జాతకకథలు, అట్టకథలు మొదలగునవెన్నియో బౌద్ధవాఙ్మయమున గలవు. ఈ బౌద్ధవాఙ్మయమున మహాపండితుడగు రాహులసాంకృత్యాయనుడు పై ముఖ్య పాళీగ్రంథములనుండి ఏర్చి కూర్చి హిందీభాషను రచింపబడిన దీ బుద్ధచర్య. ఇట్టి హిందీ గ్రంథమును మాతృకగాగొని శ్రీ భూమానందాశ్రమవాసులగు శ్రీరామకృష్ణ బ్రహ్మచారిగారు తేట తెలుగులో అతిసులభశైలిని "బుద్ధం శరణం గచ్ఛామి", "సంఘం శరణం గచ్ఛామి", "ధర్మం శరణం గచ్ఛామి" అను శరణత్రయ వివరణముతో పరిభాషా పదబాహుళ్యమును చక్కగా విశదీకరించిరి. బుద్ధలీలా ప్రసంగములని చెప్పదగిన శ్రీ బుద్ధచర్యను ఆంధ్రలోకమున కర్పించినారు. అనువాదక బ్రహ్మచారి కడు ధన్యులు! అమూల్యమగు అనువాదకుల పీఠిక బౌద్ధ ధర్మమును పండిత పామరులందరకును పరిచయము చేయగలదు. గ్రంథము ఐదు ఖండములు గలది. బుద్ధుని జీవితము ఉపదేశములు విద్యావంతులందరు తెలిసికొనదగినవి.

ఇట్టి మహాగ్రంథమునకు కాగితపు కరవుచే గాబోలు పీచు కాగితము లుపయోగించినారు.

సూరజ్‌మల్స్

1895 నుండి నగల వర్తకులు

★

రత్నాలు

313, ఎస్ప్లనేడ్, మద్రాసు.

8—(S – 5)

లాల్జి గోధు & కంపెనీవారి

ఎల్.జి

ఇంగువను

మార్కు గమనించి
కొనుడు
మోసపోకుడు

లాల్జి గోధు అండ్ కో
సౌకారుపేట, మదరాసు

(L.G 8-5)

శ్రీ రామకృష్ణమఠ ప్రచురణములు

శ్రీ రామకృష్ణ బోధామృతము (సంగ్రహ జీవితసహితము)

540 పుటలు సర్వాంగ సుందరమగు చతుర్థ ముద్రణము వెల రూ. 3-4-0

శ్రీ మద్భగవద్గీత

480 పుటలు శ్రీధరీయ టీకాసార ప్రతిపద టీకా తాత్పర్య విశేషార్థ సహితము రూ. 3-0-0

శ్రీ వివేకానంద జీవిత చరిత్ర

350 పుటలు (మద్రాసు ఆంధ్ర విశ్వవిద్యాలయములందు పాఠ్యగ్రంథము) రూ. 2-8-0

శ్రీ శారదాదేవి చరిత్ర

256 పుటలు (ఆంధ్ర విశ్వవిద్యాలయమున పాఠ్యగ్రంథము) వెల రూ. 1-12-0

శ్రీ నాగమహాశయుని జీవిత చరిత్ర

136 పుటలు (ఆదర్శప్రాయుడగు గృహస్థుని జీవితము) వెల రూ. 1-4-0

శారదా ప్రసంగములు ...	2	8	0	గురూపదేశములు ...	0	8	0
ప్రబోధరత్నాకరము ...	2	4	0	నామసంకీర్తన యొక్క విధానము ...	0	6	0
రాజయోగము ...	2	4	0	నా గురుదేవుడు ...	0	6	0
కర్మయోగము	1	8	0	శ్రీ పరమహంస జీవిత సంగ్రహము	0	4	0
భక్తియోగము ...	1	4	0	నవీన భారతదేశము ...	0	4	0
వివేకానందలేఖావళి (మొదటి భాగము)	1	8	0	ముక్తిమార్గము ...	0	3	0
వివేకానందలేఖావళి (రెండవ భాగము)	1	8	0	సర్వం విష్ణుమయం జగత్ (తెలుగు)	0	3	0
అనుష్ఠాన వేదాంతము ...	1	4	0	శ్రీ రామనామ సంకీర్తనము ...	0	1	0
వివేక సూర్యోదయము ...	1	0	0	యతిగీతము (పద్యకావ్యము) ...	0	1	0
శ్రీ పరమహంస నీతికథా రత్నములు	0	12	0	నా మతము 0 0 6 డజను	0	5	0
భక్తిమార్గము ...	0	8	0	సింహగర్జన 0 0 6 డజను	0	5	0
షికాగో నగరోపన్యాసములు ...	0	3	0				

ఇవియేకాక

సంస్కృత, ఆంగ్ల, ద్రావిడ, హిందీ, కన్నడ గ్రంథములును

వేదాంతకేసరి (ఆంగ్లము) శ్రీ రామకృష్ణ విజయము (తమిళము)

అను మాసపత్రికలును మా యొద్ద దొరకును

శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ శారదాదేవి, శ్రీ వివేకానందస్వామి

మున్నగువారి ఛాయాచిత్రములును మా యొద్ద దొరకును

ఇట్లు వ్రాయుడు :

మేనేజరు, శ్రీ రామకృష్ణమఠము, మైలాపూరు, చెన్నపురి.

సంపాదకులు : శ్రీ ఋతజానందస్వామి; శ్రీ వేదురుమూడి వేంకటకృష్ణరావు
శ్రీ కే. ఎస్. ఎస్. రాజన్ గారిచే జ్యూపిటరు ప్రెస్స్ లిమిటెడ్ (జి. టి. మద్రాసు) న ముద్రింపబడి,
శ్రీ ఆదిదేవానంద స్వామిచే శ్రీ రామకృష్ణమఠము (మైలాపూరు) నుండి ప్రచురింపబడినది. 20-11-51.